## స్వామి వారి ఆలయంలో సిపి విజయ్‌కుమార్ ప్రత్యేక పూజలు




సిపికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, జనవరి 8, ప్రభాతవార్త :** సిద్దిపేట సీపీ విజయ్‌కుమార్ పదోన్నతి పొందిన సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జునస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, సీఐ, ఎస్, ఆలయ పర్యవేక్షకులు చంద్రశేఖర్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు. పదోన్నతి పొందిన విజయ్‌కుమార్‌కు శ్రీస్వామివారి కృప ఎల్లప్పుడూ ఉండాలని భక్తులు అకాంక్షించారు.




మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త


## మంత్రి సీతక్కను సన్మానించిన కాంగ్రెస్ శ్రేణులు

**ములుగు, జనవరి 8 (ప్రభాతవార్త):** మంత్రి సీతక్కను గురువారం కాంగ్రెస్‌పార్టీ నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. సమ్మక్క సారక్క జాతర ఉత్సవాలకు మాజీ సిఎం కెసిఆర్‌ను ఆహ్వానించడానికి సీతక్క ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌కు హైదరాబాద్ నుంచి ములుగు మీదగా వెళ్తున్న క్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆమెకు ఘన స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో బహిలంపూర్ సర్పంచ్ మచ్చల కృష్ణ, యాదవ సంఘం మండల అధ్యక్షుడు యంజాల ఐలయ్యయాదవ్, నాయకుడు కరుణాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సీతక్కను శాలువాతో సన్మానిస్తున్న నేతలు



మంత్రి సీతక్కకు సమస్యను వివరిస్తున్న దృశ్యం

## అందె, మిరుదొడ్డి రోడ్డు సమస్యను పరిష్కరించాలి

### మంత్రి సీతక్కకు వినతి పత్రం అందజేత

**మిరుదొడ్డి, జనవరి 8, ప్రభాతవార్త :** మిరుదొడ్డి మండలం అందె గ్రామానికి సంబంధించిన అందె మిరుదొడ్డి ప్రధాన రహదారి దుస్థితిపై పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి అందె సర్పంచ్ కడారి యాదగిరి, గ్రామాభివృద్ధి ట్రస్ట్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులు, వర్షాకాలంలోని సమస్యలు, రైతులు పంటలను మార్కెట్‌కు తరలించడంలో పడుతున్న ఇబ్బందులను మంత్రి సీతక్కకు వివరించారు. రోడ్డు పూర్తిగా దెబ్బతిన అసౌకర్యంగా మారిందని వివరించారు. మంత్రి సీతక్క స్పందిస్తూ గ్రామ ప్రజల సమస్యలను అర్థం చేసుకొని స్పెషల్‌గ్రాంట్ కింద త్వరగా అందె, మిరుదొడ్డి రోడ్ పనులు చేపట్టాలని సంబంధిత ఇంజనీర్ ఇన్ చీఫ్‌కు ఎండార్స్ చేశారని తెలిపారు. మంత్రి సూచన మేరకు వినతిపత్రాన్ని ఇంజనీర్ ఇన్ చీఫ్‌కి అందజేసినట్లు వివరించారు. అందె, మిరుదొడ్డి రోడ్డు అభివృద్ధి జరిగితే అందరికీ సౌకర్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అందె గ్రామాభివృద్ధి ట్రస్ట్ చైర్మన్ బుర్ర సతీష్, ప్రవీణ్, వరాల రాజుకుమార్, జక్కుల రాజయ్య పాల్గొన్నారు.

## వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలి

### సబ్ కలెక్టర్ ఉమాహారతి



పిహెచ్‌సిని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఉమా హారతి

**మనూర్, జనవరి 8, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని(పిహెచ్‌సి) గురువారం సబ్ కలెక్టర్ ఎన్.ఉమాహారతి పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలను, మందుల స్టాక్‌ను, డాక్టరు, సిబ్బంది హాజరుపట్టికలను సబ్ కలెక్టర్ పరిశీలించారు. డాక్టర్లు, సిబ్బంది సమయ పాలన పాటించాలని, రోగులకు మెరుగైన వైద్యం అందించి రోగ రహిత పిహెచ్‌సిగా తయారు చేయాలని సూచించారు.

## మైకోడ్ ఎంపి యుపిఎస్‌లో ఫుడ్ ఫెస్ట్

### -తిలకించిన సబ్ కలెక్టర్, ఎంఈఓ, ఎంపిడిఓ

**మనూర్, జనవరి 8, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మైకోడ్‌లో మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులు ఫుడ్ ఫెస్ట్‌ను ఏర్పాటుచేశారు. విద్యార్థులు ఇళ్లల్లో వంటలను వండుకుని వచ్చి పాఠశాలలో ప్రదర్శించారు. విద్యార్థులు ఏర్పాటుచేసిన ఫుడ్‌ఫెస్ట్‌ను సబ్ కలెక్టర్‌నఉమాహారతి, తహసీల్దార్ విష్ణుసాగర్, ఎంపిడిఓ చంద్రశేఖర్, ఎంఈఓ శెట్కార్ రాజ్‌శేఖర్, సర్పంచ్ కరణం కృష్ణ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పరిశీలించి విద్యార్థులను అభినందించారు.

## ఎన్నికల సంఘం నియమాలను పాటించాలి

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్



**మెదక్ టౌన్ జనవరి 8, ప్రభాతవార్త:** గురువారం రామాయంపేటలో ఏర్పాటుచేసిన కౌంటింగ్‌హాల్, స్ట్రాంగ్ రూమ్‌లను మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, ఆర్డిఓ రమాదేవితో కలిసి పరిశీలించారు. ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి అన్ని ఏర్పాట్లు, కౌంటింగ్ హాల్, స్ట్రాంగ్ రూమ్‌లను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచనున్న బ్యాలెట్ పేపర్ల భద్రత, సీసీ కెమెరాల ఏర్పాటు, మూడు అంచెల భద్రత, అగ్నిమాపక పరికరాలు, విద్యుత్ సరఫరా తదితర అంశాలను తనిఖీ చేశారు. కౌంటింగ్ హాల్‌లో టేబుళ్ల ఏర్పాటు, సిబ్బంది కూర్చునే విధానం, ప్రవేశ-నిష్క్రమణ మార్గాలు, కంట్రోల్ రూమ్ ఏర్పాట్లపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, ఓట్ల లెక్కింపు పూర్తిగా పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, పోలీసు శాఖ ఉన్నతాధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పిఆర్టీయు డైరీ ఆవిష్కరణ

**మెదక్ టౌన్ జనవరి 8, ప్రభాతవార్త:** పిఆర్టీయు డైరీ(దైనందిని)ని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా విద్యాశాఖాధికారి విజయ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు సతీష్ రావు, ప్రధాన కార్యదర్శి సామ్యానాయక్, నాయకులు వెంకట్రామిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, జిల్లా, మండల బాధ్యులు రమేష్ గంగాల, శిరిగ చంద్రశేఖర్, అశోక్, శ్రీనివాస్, యాదవరెడ్డి, సుభాష్‌రెడ్డి, వీరేశం, శ్రీధర్ రెడ్డి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



డైరీ ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ నగేష్

# ఉపాధి కూలీలకు లక్ష్యం మేరకు పనిదినాలు కల్పించాలి

### విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
### పనిచేయడానికి ఇష్టం లేనివారు వెళ్లిపోవచ్చు
### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన నిర్మాణాలను ఫిబ్రవరి 15 లోగా పూర్తిచేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఈజీఎస్ పనుల ప్రగతిపై మండలాలు, గ్రామాలవారీగా జిల్లా కలెక్టర్ ఎంపిడివోలు, ఎంపివోలు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. పేదలకు ఉపాధిని కల్పిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో వసతులను అభివృద్ధి చేసేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రహదారులు, ఫాంపాండ్, ప్లాంటేషన్, నర్సరీ, ఇంకుడుగుంతలు, ఫారెస్ట్ ట్రంచేస్ తదితర ఎంఎన్‌ఆర్ఇజిఎస్ పథకంలో సూచించిన అన్ని పనులను పూర్తిచేసి టార్గెట్ ప్రకారం పంచాయతీలవారీగా ఉపాధి హామీ కూలీలకు పనిదినాలు కల్పించాలన్నారు. నిర్మాణం చేపట్టని వాటిని వెంటనే నిర్మాణం చేపట్టాలని నిర్మాణంలో ఉన్న పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు పేమెంట్ త్వరగా వచ్చేలా చూడాలన్నారు. గ్రామాల వారీగా ఉపాధి హామీ కూలీలకు నిర్దేశించిన లక్ష్యం మేరకు ఖచ్చితంగా పని దినాలు కల్పించాలని విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పని చేయడానికి ఇష్టం లేని వారు వెళ్లిపోవచ్చునని హెచ్చరించారు. సమావేశంలో డిఆర్‌డిఎ పిడి జయదేవ్ ఆర్య, జడ్పీ సీఈఓ రమేష్, డిపిఓ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

### ఇంటర్మీడియట్ పరీక్షలపై సమీక్షా

ఇంటర్మీడియట్ పరీక్షలను ఎలాంటి మాస్ ప్రాక్టీస్‌కు తావులేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హైమావతి ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్న ఇంటర్ వార్షిక పరీక్షలపై సంబంధిత అధికారులతో ముందస్తు సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో ఈ ఏడు 20 వేల 41 మంది ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులు 42 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారని తెలిపారు. మొదటి ఏడాది విద్యార్థులు 9946, రెండో ఏడాది 10095 మంది పరీక్షలకు హాజరవు తారని తెలిపారు. కార్యక్రమంలో ఇంటర్మీడియట్ అధికారి రవీందర్‌రెడ్డి, అడిషనల్ డిసిపి కుశా ల్కర్, డిఆర్వో నాగరాజమ్మ, డిఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఈ విద్యుత్ చంద్రశేఖర్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

### ఈవీఎం గోదాంను పరిశీలించిన కలెక్టర్...

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** కలెక్టరేట్ సమీపంలోగల ఈవీఎం గోదాంను సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నెలవారీ పరిశీలనలో భాగంగా గోదాం చుట్టూ వీక్షించి రక్షణ చర్యలను పరిశీలించారు. లాగ్‌బుక్ చెక్‌చేసి విజిటర్స్ రిజిస్టర్‌లో సంతం చేశారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం చుట్టూ సీసీ కెమెరాల పనితీరు, పోలీసు అధికారుల 24 గంటల బందోబస్తు ఏర్పాటును రెవెన్యూ అధికారులు తరుచు గోదాం పరిసర ప్రాంతాన్ని పర్యవేక్షణ చేయాలన్నారు.



ఎలక్టోరల్ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

## ఎలక్టోరల్‌ను త్వరగా పూర్తి చేయాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**కొండపాక, జనవరి 8, ప్రభాతవార్త:** ఎలెక్టోరల్ మ్యాపింగ్‌ను త్వరగా పూర్తిచేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్‌నహైమావతి సూచించారు. గురువారం కుకునూరుపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె సందర్శించి ఎలక్టోరల్ మ్యాపింగ్ ప్రక్రియను పరిశీలించారు. మండలంలోని అన్నిగ్రామాల్లో సూపర్‌వైజర్లు, బిఎల్‌ఓలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఓటర్ జాబితా సవరణకు సంబంధించిన అన్ని పనులను క్షేత్రస్థాయిలో ఇంఇంటికి తిరిగి పనులు వేగవంతం చేయాలని సూచించారు. రోజు చేసిన మ్యాఫింగ్ వివరాలను కంప్యూటర్‌లో అఫ్‌లోడ్ చేసే ప్రక్రియను పరిశీలించారు.

### రోడ్డు భద్రతపై అవగాహన ఉండాలి : ఎస్ఐ

**మెదక్, జనవరి 8,ప్రభాతవార్త:** రోడ్డు భద్రతపై అవగాహన ఉండాలని ఎస్ఐ నారాయణగౌడ్ అన్నారు. గురువారం చిన్నశంకరంపేటలోని ఎస్టీ వసతి గృహాల్లోని విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. అనంతరం క్రికెట్ కిట్లను అందించారు. హెడ్ కానిస్టేబుల్ విద్యా సాగర్, నర్సింలు, కానిస్టేబుల్ శ్యాంకుమార్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతుల అందజేత

**మిరుదొడ్డి, జనవరి 8, ప్రభాతవార్త :** నైపుణ్య యూత్ అసోసియేషన్, ఎన్‌వైకెఎస్ నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న మిరుదొడ్డి, దుబ్బాక, భూంపల్లి-అక్బర్‌పేట మూడు మండలాల స్కూల్ ఆటల పోటీలలో బాలికల కబడ్డీ విభాగంలో గంభీపూర్ మొదటి బహుమతి గెలుచుకోవడం జరిగింది. మిరుదొడ్డి మండల కేంద్రానికి చెందిన 6వ వార్డు సభ్యులు మద్దెల రాజు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

### మీ బిడ్డను చదివించాలని ఉత్తరం పంపించిన

## మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నదే నా తపన

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

**సిద్దిపేట రూరల్, జనవరి 8, ప్రభాతవార్త :** నేను మీకు ఉత్తరం పంపిన వచ్చిందా...పది నుంచే మీ పిల్లల భవిష్యత్ ప్రారంభం అవుతుందని మార్చి నెలలో ప్రారంభం అయ్యే పదో తరగతి పరీక్షల నేపథ్యంలో మీ పిల్లలను చదివించేందుకు నియోజకవర్గంలోని విద్యార్థుల తల్లిదండ్రులతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు గురువారం కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్దిరోజుల్లోనే పిల్లలు పదో తరగతి పరీక్షలు రాయబోతున్నారని వారి చదువు ఇది అత్యంత కీలకమైన ఘట్టం అన్నారు. మంచి మార్కులతో గట్టెక్కితేనే ఉన్నత చదువుల దిశగా ముందడుగు వేసే అవకాశం ఉంటుందన్నారు. పిల్లలు పరీక్షలు రాసే ముందు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. వార్షిక పరీక్షలు ముగిసేవరకు పిల్లలపై దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. సెల్‌ఫోన్లకు, విందులు, వినోదాలు, ఫంక్షన్లు, సినిమాలు, టీవీలకు దూరంగా ఉంచాలన్నారు. పిల్లలు మంచి మార్కులు సాధించడానికి డిజిటల్ కంటెంట్ పుస్తకాలు అందించడం జరుగుతుందన్నారు. సిద్దిపేట పదో తరగతి ఫలితాల్లో ఆదర్శంగా నిలవాలనేదే నా తాపత్రయం అందుకే ప్రజాప్రతినిధిగా మీ కుటుంబంలో ఒకడిగా నా వంతు ప్రయత్నం చేస్తున్నానని తెలిపారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన బిజెపి నాయకులు

**ములుగు, జనవరి 8 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని బండతిమ్మాపూర్ గ్రామానికి చెందిన సాధు బాలేష్ ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాన్ని బిజెపి నాయకులు అరుణ్‌కుమార్‌రెడ్డి, మన్నె శ్రీనివాస్ ముదిరాజ్ గురువారం పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. వారితో పాటు భాస్కర్‌రెడ్డి, రమేష్ యాదవ్, భాస్కర్, చందు, కన్నారెడ్డి, హరికృష్ణ, కొండ నర్సింలు, మహేష్ కుమార్, భాస్కర్‌యాదవ్, బాబు, చాకలి శ్రీను, మధు, మల్లేష్, రాజు, సత్యనారాయణ, సాయి, నవీన్, నరేందర్, కిరణ్, వినోద్‌లు ఉన్నారు.

## గ్రామాలను కలిసికట్టుగా అభివృద్ధి చేద్దాం : ఎంపిడివో

**ములుగు, జనవరి 8 (ప్రభాతవార్త):** గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని ఎంపిడివో మేరీ స్వర్ణకుమారి కోరారు. గురువారం ఎంపిడివో కార్యాలయంలో సర్పంచ్‌లతో అధికారుల పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించగా అధికారులు సర్పంచ్‌ల బాధ్యతలు వివరిస్తూ చేయాల్సిన అభివృద్ధి పనులకు తమవంతు సహకారాన్ని అందిస్తామని ఆయా శాఖల అధికారులు తెలిపారు. అలాగే గ్రామాలలో జరిగే అభివృద్ధి పనులు సర్పంచ్‌లకు తెలుపకుండా అధికారులు చేపట్టవద్దని సర్పంచ్‌లు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారకిఇ అందేవిధంగా సర్పంచ్‌లు చూడాలని తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లను ఎంపిడివో మేరీ స్వర్ణకుమారి శాలువాలతో సన్మానించారు.



సర్పంచ్‌లను సన్మానించిన ఎంపిడివో స్వర్ణకుమారి



గౌరవెల్లి ప్రాజెక్టును పరిశీలిస్తున్న పాండే

### గౌరవెల్లి ప్రాజెక్టును పరిశీలించిన

## గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డ్ చైర్మన్ బిపి పాండే

**అక్కన్నపేట, జనవరి 8, ప్రభాతవార్త :** మండలంలోని గౌరవెల్లి ప్రాజెక్టు పనులను నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు గురువారం గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డ్(జీఆర్ఎంబీ) చైర్మన్ బీపీ పాండే సందర్శించారు. గౌరవెల్లి ప్రాజెక్టుపై నిర్వాసితులు ఎన్జీటీలో కేసు వేయడంతో, ప్రాజెక్టు పనులను నిలిపివేయాలని, ప్రాజెక్టు పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎన్జీటీ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే ఏర్పాటుచేసిన సీసీకెమెరాల వీడియోలు, గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు ప్రసారం కావాల్సి ఉందని, అయితే ఇటీవల విజువల్స్ అందకపోవడంతో అక్కడ పనులు జరుగుతున్నాయనే అనుమానంతో బోర్డు అధికారులు ప్రాజెక్టును సందర్శించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రాజెక్టు ప్రాంతంలో, పంప్ హౌస్‌లో పనులు ఏవీ జరగలేదని, ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు దొంగలించబడ్డాయని గుర్తించామన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ బీపీ పాండే మాట్లాడుతూ ప్రాజెక్టు ప్రాంతంలో తక్షణమే కొత్త సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ శాఖను ఆదేశించారు. అలాగే, కెమెరాలను సుమారు 20 మీటర్ల ఎత్తులో ఏర్పాటు చేస్తే దొంగతనాలకు అవకాశం ఉండదని సూచించారు. దొంగలించబడిన కెమెరాలపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని కూడా ఇరిగేషన్ శాఖకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు జీఆర్ఎంబీ మెంబర్ సెక్రటరీ ఆర్.ఎం. రంగరాజన్, ఈఈ ఎం. వేణుగోపాల్‌తో పాటు ఇరిగేషన్ రాములు నాయక్, డిఇలు ప్రశాంత్, చైతన్య, నందా, రేష్మ, రాజేందర్ ఉన్నారు.

### అమీన్‌పూర్, తెల్లాపూర్ పరిధిలో

## మరో రెండు డివిజన్లు ఏర్పాటు చేయాలి : ఎమ్మెల్యే




జిహెచ్‌ఎంసి కమిషనర్ కర్ణన్‌కు వినతిపత్రం అందిస్తున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**పటాన్‌చెరు, జనవరి 8, ప్రభాతవార్త :** పరిపాలన వికేంద్రీకరణ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జిహెచ్‌ఎంసి పరిధిలో చేపట్టిన నూతన డివిజన్ల ఏర్పాటులో భాగంగా పటాన్‌చెరు నియోజకవర్గంలోని తెల్లాపూర్, అమీన్‌పూర్ పరిధిలో మరో రెండు నూతన డివిజన్లు ఏర్పాటు చేయాలని, ప్రజల సౌకర్యార్థం పటాన్‌చెరు, రామచంద్రాపురం కేంద్రాలుగానే సర్కిల్ కార్యకలాపాలు కొనసాగించాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కోరారు. గురువారం హైదరాబాద్ లోని జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో జిహెచ్‌ఎంసి కమిషనర్ తో ఎమ్మెల్యే జీఎంఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ.. దశాబ్దాల చరిత్రతో పాటు నియోజకవర్గ కేంద్రంగా కలిగిన పటాన్ చెరు డివిజన్ పరిధిలోని జిహెచ్‌ఎంసి పటాన్చెరు సర్కిల్ కార్యాలయాన్ని తెల్లాపూర్‌కు తరలించడం జరిగిందని, కార్యాలయాన్ని స్థానికంగానే కొనసాగించాలని, లేనిపక్షంలో ప్రజలతో పాటు పాలనాపరంగా తీవ్ర ఇబ్బందులు నెలకొంటాయని గతంలోనే కమిషనర్‌కు విన్నవించడం జరిగిందని తెలిపారు. దీంతోపాటు అమీన్‌పూర్ కేంద్రంగా నూతనంగా ఏర్పాటు చేసిన సర్కిల్ కార్యాలయాన్ని రామచంద్రపురం కేంద్రంగా కొనసాగించాలని కమిషనర్ ను కోరినట్లు తెలిపారు. పై రెండు అంశాలపై కమిషనర్ సానుకూలంగా స్పందించడం జరిగిందని, త్వరలో ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడనున్నట్లు తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో నూతనంగా అమీన్‌పూర్, బీరంగూడ డివిజన్లు ఏర్పాటు చేయడం జరిగిందని, పాత అమీన్పూర్ మండల పరిధిలోని ఎనిమిది గ్రామాలను కలిపి కిష్టారెడ్డిపేటతో ఒక డివిజన్ తెల్లాపూర్ డివిజన్ పరిధిలో మరొక నూతన డివిజన్ ఏర్పాటు చేయాలని ఆయన కమిషనర్ కు విన్నవించారు. నూతన డివిజన్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు కమిషనర్ కర్ణన్ ఎమ్మెల్యే జీఎంఆర్ కు తెలిపారు.

## వల్లంపట్లలో 11వ శతాబ్దపు గణపతి రాతి విగ్రహం



**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి (మద్దూరు):** సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం వల్లంపట్ల గ్రామంలో పునర్మిర్మాణం జరుగుతున్న దేవాలయం సమీపంలో పురాతన విడి శిల్పాలున్నాయని తెలంగాణ చరిత్ర బృందం పరిశోధక సభ్యుడు సామలేటీ మహేష్ ఈ శిల్పాలను గురువారం పరిశీలించారు. ఇక్కడి 5 అడుగుల ఎత్తున్న చతుర్భుజ గణపతి శిల్పం ఎంతో ప్రత్యేకమన్నారు. లలితాసనంలో ఆసీనుడైన గణపతి పరహస్తాలలో పరశువు, పుష్పం, నిజ హస్తాలలో విరిగిన దంతం, కుడుములతో ఎడమవైపు తిరుగున్న తొండంతో పొట్టమీద నాగబంధంతో మూషికవాహనుడై ఆగుపిస్తున్నాడని తెలిపారు. వెనకవైపు పుష్పం, భుజంపై నుంచి సంధ్యం కనిపిస్తున్నాయని తెలిపారు. ఈ విగ్రహం అలంకరణలశైలి శిల్పరూపం రీత్యా 11వ శతాబ్దం, చాళుక్యుల కాలం నాటిదని తెలుస్తుందన్నారు. అరుదుగా కనిపించే గణపతి శిల్పం ఈ గ్రామంలో కనిపించడంతో ఈ ప్రాంతంలో కాలాముఖశైవం గాణపత్యం విస్తరించి వుంటాయని తెలిపారు.

## కారు బోల్తా.. పలువురికి గాయాలు

**మనూర్, జనవరి 8, ప్రభాతవార్త:** టైరు పేలి కారు బోల్తా పడటంతో పలువురికి గాయాలైన సంఘటన గురువారం మనూర్ గ్రామ శివారులో జరిగింది. వివరాల్లోకి వెళితే... జహీరాబాద్ పట్టణంలోని రాంనగర్ కాలనీకి చెందిన భవాని, కార్తీక్, అనిరుద్, ఈశ్వర్ కలిసి కారులో మనూర్ మండలం పిప్రి గ్రామంలోని బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యక్రమంలో పాల్గొని గురువారం మధ్యాహ్నం తిరుగు ప్రయాణంలో మనూర్ తండా వద్ద టైరు పంక్చర్ కావడంతో కారు అదుపుతప్పి పక్కనేగల వాగులోకి దూసుకుపోయింది. కారులో ప్రయాణిస్తున్న భవాని, కార్తీక్‌లకు గాయాలు కావడంతో గమనించిన గ్రామ మాజీ సర్పంచ్ శివాజీరావు, మాజీ జడ్పీటిసి తనయుడు నాగేందర్‌లు 108 వాహనానికి సమాచారం అందించగా 108 సిబ్బంది సుఖేందర్, గోపాల్‌లు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నారాయణఖేడ్‌లోని ఆసుపత్రికి తరలించారు.

# కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండూ ఒక్కటే

### మెదక్ ఎంపి రఘునందన్ రావు




మాట్లాడుతున్న రఘునందన్‌రావు

**నర్సాపూర్, జనవరి 8, ప్రభాతవార్తార్త:** టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నర్సాపూర్‌లో ఏ ఒక్కరికీ డబుల్ బెడ్ రూమ్ ఇవ్వలేదని, అలాగే కాంగ్రెస్ ప్రజాప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లకు దిక్కేలేదని మెదక్ ఎంపి రఘునందన్‌రావు అన్నారు. గురువారం నర్సాపూర్‌లో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ టిఆర్ఎస్ పార్టీలు ఒకటేనని ఆయన విమర్శించారు. ప్రస్తుత ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన సమయంలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు తప్ప పొజిషన్ చూపలేదన్నారు. మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి టిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా పది సంవత్సరాలు పనిచేసిన సమయంలో అప్పటి ముఖ్యమంత్రి సన్నిహితుడు అని చెప్పుకున్నారు తప్ప నియోజకవర్గానికి చేసింది ఏమీ లేదని, డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లను పంచలేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వేసిన రోడ్లే తప్ప రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడా రోడ్లు వేయలేదని విమర్శించారు. కేంద్రం నిధులు వాపస్ పోతాయని భయంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుగా పంచాయతీ ఎన్నికలు జరిపిందని కాగా ప్రస్తుతం కేంద్రం నుంచి వచ్చే నిధులు వెనక్కు వెళతాయని ఉద్దేశంతో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని సిద్ధపడుతుందని చెప్పారు. గుమ్మడిదల నుండి నర్సాపూర్ వరకు ఉన్న ఉన్న ఫోర్‌లైన్ హైవే రోడ్డును మూలమలుపులు లేకుండా ఒక ఫ్లై ఓవర్ రోడ్డు వేయాలని, దీనికి రూ. 100 నుండి రూ. 150 కోట్లు ఖర్చు అవుతుందని, కేంద్ర రవాణ మంత్రికి ప్రతిపాదనలు పంపినట్టు ఆయన తెలిపారు. ప్రస్తుత ఎమ్మెల్యే సునీతలక్ష్మారెడ్డి పార్టీలు పదవులు మారుతుంది తప్ప నర్సాపూర్ నియోజకవర్గానికి చేసింది ఏమీ లేదని విమర్శించారు. కల్వకుంట్ల కవిత పార్టీ పెడతదన్నా విషయాన్ని ప్రస్తావిసే ఆమె పార్టీ పెడితే స్వాగతిస్తామని ఎంపి రఘునందన్‌రావు అన్నారు. నర్సాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ పదవి దక్కించుకునేందుకు కార్యకర్తలు కలిసికట్టుగా ఉండి బిజెపి జెండాను ఎగరవేయాలని ఎంపీ రఘునందన్‌రావు సూచించారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీధర్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్‌గౌడ్, ఉపాధ్యక్షుడు బుచ్చేస్‌యాదవ్, ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘసాని సురేష్, నాయకులు గోడ రాజేందర్, ఎర్ర గొల్ల రమేశ్‌యాదవ్, నీరుడి చంద్రయ్య, హన్మంత్ రమణారావు, పెద్ద రమేష్‌గౌడ్, గుండం శంకర్, బాదె బాల్‌రాజు, సంగసాని సురేశ్, వెంకట్ నాగేందర్, రాములునాయక్, బోర్‌వెల్ రామ్‌రెడ్డి, కృష్ణ ఉన్నారు.

## వేడుకగా ముందస్తు సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి వేడుకలను జరుపుకుంటున్న విద్యార్థులు

**మెదక్, జనవరి 8, ప్రభాతవార్త:**
చిన్నశంకరంపేట మండలపరిధి చందాపూర్, భాగీర్తిపల్లి పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. హరిదాసు, సంప్రదాయ దుస్తులు, రంగవల్లులు, భోగి మంటల నడుమ సంబరాలను నిర్వహించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పరమేశ్వర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డిలు మాట్లాడుతూ భవిష్యత్ తరాల వారికి మన సంప్రదాయాలు, కట్టుబాటులు గుర్తుండేలా పండుగలు నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బాలికల కబడ్డీలో పాపన్నపేటకు ప్రథమస్థానం



విజేతలకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం

**పాపన్నపేట, జనవరి 8, ప్రభాతవార్త:**
జిల్లా కేంద్రమైన మెదక్ జూనియర్ కళాశాల గ్రౌండ్లో గత మూడు రోజులుగా జరుగుతున్న పీఎం శ్రీ పాఠశాలల కబడ్డీ పోటీల్లో పాపన్నపేట ఉన్నత పాఠశాల బాలికల జట్టు ప్రథమ స్థానం, బాలుర విభాగం మూడో స్థానం సాధించింది, జిల్లాలో 28 పీఎం శ్రీ పాఠశాలల నుండి బాలుర, బాలికల విభాగం విద్యార్థులకు కబడ్డీ పోటీలు నిర్వహించగా, బాలికల విభాగంలో పాపన్నపేట ఉన్నత పాఠశాల జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం, బాలుర విభాగంలో మూడోస్థానం సాధించినట్లు పాఠశాల పిడి రమేష్ వెల్లడించారు, ఈ మేరకు గురువారం సాయంత్రం జూనియర్ కళాశాల గ్రౌండ్ లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో మెదక్ టౌన్ సిఐ మహేష్ చేతులమీదుగా పాపన్నపేట బాలికల, బాలుర కబడ్డీ జట్టు, బహుమతులు అందుకున్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య, బోజనం

**–టేక్మాల్ సర్పంచి తిమ్మిగారి సుధాకర్**



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

**టేక్మాల్, జనవరి 8, ప్రభాతవార్త:**
విద్యార్థులకు నాణ్యమైన, విద్యతో కూడిన బోజనం అందించాలని టేక్మాల్ సర్పంచ్ తిమ్మిగారి సుధాకర్ అన్నారు, గురువారం మండల కేంద్రమైన టేక్మాల్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అనంతరం విద్యార్థులతో, కలిసి మధ్యాహ్నా భోజనం ఎలా ఉంది రుచికరమైన భోజనాలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నా భోజనాన్ని పరిశీలించి వడ్డించి విద్యార్థులతో పలకరించి సమస్యలను తెలుసుకున్నారు. మెనూ ప్రకారము భోజనాన్ని అందించాలని విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకు రావాలని చెప్పారు, చలి తీవ్రంగా ఉండడం వల్ల ఉదయం వేళ చన్నీళ్ళకు బదులు వేడి నీళ్లతో స్నానం చేయాలని విద్యార్థులకు తెలిపారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నిమ్మ రమేష్, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ మజహర్, మాజీ సర్పంచ్ ఆకులపల్లి పాపయ్య, టౌన్ వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్, అంబేష్, కాంతం, శివశంకర్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు



ఎంపిడివో దామోదర్‌కు ఫిర్యాదుచేస్తున్న పాలకవర్గ సభ్యులు

**మెదక్, జనవరి 8, ప్రభాతవార్త:**
చిన్నశంకరంపేట మండల పరిధి ధర్పల్లి పంచాయతీ కార్యదర్శిపై గ్రామ పాలకవర్గ సభ్యులు గురువారం ఎంపీడీవో దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. గత కొంత కాలంగా కార్యదర్శి నాగరాజు గ్రామస్థులకు అందుబాటులో ఉండకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలకు అనుమతులిస్తూ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఆటంకం కలిగిస్తున్నాడని ఆరోపించారు. కార్యదర్శి అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సర్పంచి మానస, ఉప సర్పంచి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## గజ్వేల్‌లో రోడ్డు భద్రత మాసోత్సవాల ర్యాలీ



ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**గజ్వేల్, జనవరి 8, ప్రభాతవార్త:**
జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా గురువారం గజ్వేల్ పట్టణంలో జాతీయ రహదారి 161 ఏఏపై గజ్వేల్ కోర్టు నుండి పిడిచెడ్ ఎక్స్ రోడ్డు వరకు గజ్వేల్ అడిషనల్ జెఎఫ్‌సిఎం కోర్టు మెజిస్ట్రేట్ మనివీర్, గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి, గజ్వేల్ సిఐ రవికుమార్‌లు న్యాయవాదులు, పోలీస్ సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. వాహనదారులకు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోర్టు సూపరిండెంట్లు జ్యోతింద్రనాథ్‌రెడ్డి, హనుమంతరెడ్డి, కోర్టు సిబ్బంది, బార్ అసోసియేషన్ అడ్వకేట్లు, ప్రజలు, వాహనదారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అండర్ పాస్ బ్రిడ్జిని మంజూరు చేయండి

## -అండర్ పాస్ బ్రిడ్జిని మంజూరు చేయాలని కోరుతున్న మిర్జాపల్లి గ్రామస్థులు

**మెదక్, జనవరి 8, ప్రభాతవార్త:**
చిన్నశంకరంపేట మండల పరిధిలోని మిర్జాపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో అండర్ పాస్ బ్రిడ్జిని మంజూరు చేయాలని మిర్జాపల్లి గ్రామ సర్పంచి యాదగిరి, గ్రామస్థులు గురువారం సికింద్రాబాద్ లోని రైల్ నిలయంలో డివిజనల్ రైల్వే మేనేజర్ పిఆర్‌వో శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందించారు. రైల్వే స్టేషన్‌కు ఇరువైపులా గ్రామం ఉండటంతో స్టేషన్ దగ్గరలో ఉన్న పురాతన అండర్ పాస్ బ్రిడ్జిలో వర్షాకాలంలో నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈమార్గం గుండా మదూర్, గజగట్లపల్లి, చెన్నాయిపల్లి, శాలిపేట, వెంకట్‌రావుపల్లి, గవ్వలపల్లి ప్రయాణికులు రైల్వే స్టేషన్‌కు చేరుకుంటారని, బ్రిడ్జి చిన్నదిగా ఉండటంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడుతుందని తెలిపారు. మరో అండర్ పాస్ బ్రిడ్జిని నిర్మించాలని రైల్వే అధికారులను కోరారు. మిర్జాపల్లి రైల్వే స్టేషన్ నుండి ప్రయాణికులు, విద్యార్థులు నిజామాబాద్, కామారెడ్డిల నుండి సికింద్రాబాద్‌కు ప్రయాణిస్తారని, వారిని దృష్టిలో ఉంచుకొని అండర్ పాస్ బ్రిడ్జిని త్వరగా మంజూరు చేయాలని కోరారు.



డివిజనల్ రైల్వే మేనేజర్ పిఆర్‌వో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

కార్యక్రమంలో ఉపసర్పంచి రాజు, మనోజ్, పెంట య్య, ఖాసిం, శేఖర్, నరేష్ పాల్గొన్నారు.

## హరీష్‌రావును కలిసిన పట్టణ సర్పంచి కంజర్ల



హరీష్‌రావును కలిసిన పట్టణ సర్పంచి చంద్రశేఖర్

**మెదక్, జనవరి 8, ప్రభాతవార్త:**
మాజీమంత్రి హరీష్‌రావును చిన్నశంకరంపేట పట్టణ సర్పంచి చంద్రశేఖర్ దంపతులు హరీష్‌రావు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరీష్‌రావు చంద్రశేఖర్‌ను సన్మానించారు. చిన్నశంకరంపేట పట్టణాన్ని అభివృద్ధి చేసేలా కృషి చేయాలని హరీష్‌రావు చంద్రశేఖర్‌కు సూచించారు.

## నిరక్షరాస్యత నిర్మూలనే ఉల్లాస్ లక్ష్యం

**–పిఓ స్వాతి**



శిక్షణ తరగతులు నిర్వహించిన దృశ్యం

**పటాన్‌చెరు, జనవరి 8, ప్రభాతవార్త:**
నిరక్షరాస్యత నిర్మూలనే ఉల్లాస్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పిఓ స్వాతి వెల్లడించారు. ఉల్లాస్ కార్యక్రమంపై మహిళాసమాఖ్య సభ్యులకు గురువారం పటాన్‌చెరు పట్టణంలోని జిహెచ్‌ఎంసి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో శిక్షణ తరగతులు జరిగాయి. ఓరుగల్లు మహిళాసమాఖ్య రిసోర్స్ పర్సన్లు శిక్షణ అందించారు. ఈసందర్భంగా స్వాతి మాట్లాడుతూ.. అక్షరాస్యతను నిర్మూలించడానికై ఇది ఒక గొప్ప అడుగని ఆమె వర్ణించారు. అక్షరాస్యత పెరిగితే వ్యక్తిగత లాభంతో పాటు సమాజం కూడా ముందుకు సాగడం సులభం అవుతుందని తెలిపారు. చదువు మధ్యలో నిలిపివేసిన లక్షలాదిమంది వయోజనులు చదువు నేర్చుకొనే అవకాశం కల్పించడమే ఉల్లాస్ ప్రధాన లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో సిఓలు రేఖ, విజయజ్యోతి, వాసు, టిఎల్‌ఎఫ్ కోశాధికారి కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ పాం సాగుతో లాభాలు

**నర్సాపూర్ రూరల్, జనవరి 8, ప్రభాతవార్త:**
ఆయిల్ పాంతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి దేవ్‌కుమార్ అన్నారు. గురువారం మండల పరిధి కాగజ్ మద్దూర్ గ్రామంలో రైతు వెంకటరమణ 8ఎకరాల వ్యవసాయక్షేత్రంలో ఆయిల్ పామ్ మొక్కలను నాటారు. ఆయన మాట్లాడుతూ ఈ పంట సాగుకు ప్రభుత్వం సబ్సిడీ రూపంలో 200 రూపాయలు ఉన్న మొక్కలను 20 రూపాయలకు అందజేయడం జరుగుతుందని, డ్రిప్ సబ్సిడీ ఎస్సీ ఎస్టీ రైతులకు 100 గాను జనరల్ రైతులకి 90 వరకు రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ఆయిల్ పామ్ సాగు ప్రోత్సహించే దిశగా రైతు భరోసాతోపాటు ప్రభుత్వం అంతర పంటలు వేసుకోవడానికి ఎకరానికి 2100, ఎరువులకు 2100 రూపాయలు అందించడం జరుగుతుందన్నారు. ఆయిల్ పామ్ పంట వేసుకోవడం వలన మంచిరాబడి పొంది రైతులు అభివృద్ధిచెందడానికి వీలవుతుందన్నారు. కార్యక్రమంలో, జిల్లా ఉద్యానవన అధికారి ప్రతాప్‌సింగ్, లీవ్ పామ్ అధికారి డా.రంగనాయకులు, సహాయ వ్యవసాయ సంచాలకులు సంధ్యారాణి, మండల వ్యవసాయ అధికారిణి దీపిక, వ్యవసాయ విస్తరణ అధికారులు మోహన్, తేజస్విని, రుతు, ఉపసర్పంచి భాస్కర్, లీవ్ పామ్ రిసోర్సెస్ కంపెనీ మేనేజర్ కృష్ణరావు, టెక్నికల్ పర్సన్ అజయ్, శ్రీధర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సమాజానికి సైకాలజిస్టుల సేవలు అవసరం

**సైఫాబాద్, జనవరి 8 ప్రభాతవార్త:** నేటి ఉరు కుల, పరుగుల జీవితంలో పెరుగుతున్న వత్తిళ్ళ దృష్ట్యా సమాజానికి సైకాలజిస్టుల సేవలు ఎంతో అవసరమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. ఈ మేరకు తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ రూపొందించిన నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించి మాట్లాడా రు. మానసిక ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్న తెలంగాణ సైకాలజీస్ట్స్ అసోసియేషన్ సేవలను ఆయన కొనియాడారు.

## గీతంలో సంక్రాంతి సంబరాలు

**–సంప్రదాయాల సాంస్కృతిక గొప్పతనాన్ని ప్రదర్శించిన విద్యార్థులు**

**పటాన్‌చెరు, జనవరి 8, ప్రభాతవార్త:**
హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో గురువారం సంక్రాంతి సంబరాలను ఉల్లాసంగా, ఉత్సాహంగా నిర్వహించారు. మనదేశ గొప్ప వ్యవసాయ వారసత్వాన్ని ఈవేడుకలు ప్రతిబింబించాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల సంక్రాంతి సంప్రదాయాల సాంస్కృతిక గొప్పతనాన్ని ప్రదర్శించాయి. మొత్తంమీద పంటల వేడుక రంగులు, సంప్రదాయాలు పండుగ స్ఫూర్తిని సజీవంగా నిలిపాయి. పలు విభాగాల విద్యార్థులు, అధ్యాపకుల మధ్య ఐక్యత, సామరస్యాన్ని సూచిస్తూ భోగిమంటలను వెలిగించడంతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. సమగ్ర సాంప్రదాయిక వాతావరణాన్ని ప్రోత్సహించడంలో గీతం నిబద్ధతను ఈ వేడుకలు పునరుద్ఘాటించాయి. ఆతిథ్య విభాగం క్యాంపస్ లైఫ్ డైరెక్టరేట్ పర్యవేక్షణలో, విద్యార్థి క్లబ్ అన్వేషణ ఈ సంక్రాంతి సంబరాలను నిర్వహించింది.

## బివిఆర్‌ఐటిలో కాంక్రీట్ కానో ఫైనల్ రేసింగ్



పోటీలను ప్రారంబిస్తున్న విష్ణు విద్యాసంస్థల చైర్మన్ కెవి విష్ణురాజు

**నర్సాపూర్, జనవరి 8, ప్రభాతవార్త:**
సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థుల ప్రతిభను ప్రదర్శించేందుకు అద్భుత అవకాశమని విష్ణు విద్యాసంస్థల చైర్మన్ కెవి విష్ణురాజు పేర్కొన్నారు. గురువారం బివిఆర్‌ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో 2వ జాతీయస్థాయి విష్ణు కాంక్రీట్ కానో2026 ఫైనల్ రేసింగ్ పోటీలు ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీవిష్ణు విద్యాసంస్థల చైర్మన్ కెవి విష్ణురాజు హాజరయ్యారు. 2వ సారి జాతీయ స్థాయిలో విష్ణు నేషనల్ కాంక్రీట్ కానో విఎన్‌సిసిసి2026 రెండో రోజు ఫైనల్ రేసింగ్ పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలలో దేశవ్యాప్తంగా 34 ఇంజనీరింగ్ కాలేజీలు కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, చత్తీస్ఘడ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కల ప్రముఖ ఐఐటి, ఎన్ఐటి, ప్రైవేట్ యూనివర్సిటీ, ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలతోపాటు బివి రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మొదలైన ఇంజనీరింగ్ కాలేజెస్ పాల్గొన్నాయి. కార్యక్రమంలో డైరెక్టర్, డా.లక్ష్మీ ప్రసాద్, ప్రిన్సిపాల్ డా.సంజయ్ దూబే, సివిల్ ఇంజనీరింగ్ హెడ్ అఫ్ ది డిపార్ట్మెంట్, కన్వీనర్ అఫ్ ది ప్రోగ్రామ్ డాక్టర్ ఎస్. కృష్ణారావు, అన్నివిభాగాల హెచ్ఓడిలు, డీన్స్, సివిల్ ఇంజనీరింగ్ అసోసియేట్ హెడ్ అఫ్ ది డిపార్ట్మెంట్ డాక్టర్ విజయ్‌కుమార్, కోకన్వీనర్, సివిల్ ఇంజనీరింగ్ అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థినీవిద్యార్థులు విరివిగాపాల్గొని విజయవంతంచేశారు. కార్యక్రమంలో కళాశాల మేనేజర్ బాపి రాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతులకు యూరియా కార్డుల పంపిణీ



అహ్మదీపూర్‌లో రైతులకు యూరియా కార్డులు అందజేస్తున్న దృశ్యం

**గజ్వేల్ టౌన్, జనవరి 8, ప్రభాతవార్త:**
గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామంలోని రైతు వేదికలో ఏఈవో అంజలి రైతులకు యూరియా కార్డులను పంపిణీ చేయగా గురువారం గజ్వేల్‌లోని ఎఫ్‌పిసి ఇన్‌పుట్ షాప్‌లో కార్డుల ద్వారా రైతులు యూరియాను తీసుకున్నారు. ఈ సందర్భంగా వేముల రవీంద్రచారి, కరుణాకర్‌లు మాట్లాడుతూ దళారుల ప్రమేయం తొలగిపోయి నిజమైన పంట సాగు చేసే రైతులకు మాత్రమే యూరియా అందుతుందని తెలిపారు. అన్ని గ్రామాల్లో వ్యవసాయ విస్తరణాధికారుల పర్యవేక్షణలోఈ యూరియా కార్డుల పంపిణీ చేయబడతాయని, రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్‌తో యూరియా విక్రయ కేంద్రాలను సంప్రదించాలని తెలిపారు.

# కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు మానుకోవాలి



మాట్లాడుతున్న దృశ్యం

**పాపన్నపేట, జనవరి 8, ప్రభాతవార్త:**
కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు మానుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం అన్నారు. గురువారం పాపన్నపేటలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లతో పాటు వీబీ రామ్ జీ చట్టం, జాతీయ విత్తన, విద్యుత్ సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలన్నారు. ఈ విధానాలతో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బడా వ్యాపారులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. ఈ విధానాలను నిరసిస్తూ సీఐటీయూ, రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 19న జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనలు, సభలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేశం, రైతు సంఘం జిల్లా కార్యదర్శి భాగయ్య, సీఐటీయూ మండల నాయకుడు అశోక్, రైతు, కార్మిక సంఘాల నాయకులు, తదితరులున్నారు.

## సిసి కెమెరాలు అందజేయడం అభినందనీయం

**-80వేల సిసి కెమెరాలను అందజేసిన సుధీర్‌గౌడ్**

**నర్సాపూర్, జనవరి 8, ప్రభాతవార్త:**
నర్సాపూర్ పట్టణంలోని రెండవ వారునడ ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయాలని ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ రెండవ వార్డు ఇంచార్జ్, జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శి అంతారం సుధీర్‌గౌడ్ 80వేల సిసి కెమెరాలు విరాళంగా ఇవ్వడం అభినందనీయమని సిఐ జాన్‌రెడ్డి, ఎస్సై రంజిత్‌కుమార్‌రెడ్డిలు అన్నారు. ఈసందర్భంగా సిఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డిలు సుధీర్ సుధీర్‌గౌడ్‌ను అభినందించారు. సహకరించిన సిఐ, ఎస్సై ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## పేదల కోసం సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు

**-కాంగ్రెస్ నాయకులు**

**వెల్దుర్తి, జనవరి 8, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన వెల్దుర్తిలో గురువారం నాడు కాంగ్రెస్ వెల్దుర్తి పట్టణ అధ్యక్షుడు మల్లేశం చారి ఆధ్వర్యంలో సి ఎం ఆర్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన హనుమద్రికల్పన 50 వేల రూపాయలు. గజం నరేష్ 47,500. హనుమద్ కమల 42,500 చెక్కులను నరసపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి గారి సహకారంతో అందజేయడం జరిగిందని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. ఆరోగ్య విషయంలో పేదలకు సీఎంఆర్ చెక్కులు గొప్ప వరమని వీటిని సద్వినియోగం చేసుకొని లబ్ధిదారులకు సూచించారు. పేద ప్రజలు ఆరోగ్య విషయంలో వైద్యం కోసం ఎన్నో కష్టాలు పడుతుంటారని అలాంటప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం తమకు అండగా ఉంటున్నామని సీఎం అర్హులను అందించి ఆదుకోవడం జరుగుతుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు శేఖర్ గౌడ్. కిష్టా గౌడ్. గజం ప్రవీణ్. దండు రాములు. ఫరీద్ తదితరులు పాల్గొన్నారు

## ఉత్సాహంగా ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం



మొక్కను నాటుతున్న ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, వాలంటీర్లు

**గజ్వేల్, జనవరి 8, ప్రభాతవార్త:**
గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1, యూనిట్-2 ఆధ్వర్యంలో మండల పరిధిలోని గిరిపల్లి, ధర్మారెడ్డి గ్రామాల్లో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం గురువారం ఆరవ రోజు కార్యక్రమాలు ఉత్సాహంగా కొనసాగాయి. ఈ శిబిరాన్ని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ పి.సౌజన్య, డాక్టర్ కె.సరోజ ఆధ్వర్యంలో నిర్వహించగా వాలంటీర్లు యోగా, ధ్యాన కార్యక్రమాలతో ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో వాలంటీర్లు రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. అలాగే గ్రామాల్లో సర్వే నిర్వహించి ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులు, జీవన ప్రమాణాలపై సమాచారాన్ని సేకరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎ.బాలచంద్రం, డాక్టర్ ఎ.నరేష్‌బాబులు పాల్గొని ఆర్థిక ప్రణాళిక, పొదుపు, బ్యాంకింగ్ సేవలు, డిజిటల్ లావాదేవీలు, ఆహారం పోషణ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. సాయంత్రం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాన్ని సందర్శించిన బోధనా సిబ్బంది డాక్టర్ పి.జయరాజు, దేవదాస్, శృతి, అన్వర్, స్వర్ణలు వాలంటీర్లను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది శ్రీధర్, భాస్కర్, సంపత్, జయరాం పాల్గొన్నారు.

## ఛారిటబుల్ ట్రస్టు ప్రారంభం



చారిటబుల్ ట్రస్టును ప్రారంభిస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్లు

**గజ్వేల్, జనవరి 8, ప్రభాతవార్త:**
గజ్వేల్ పట్టణానికి చెందిన కీర్తిశేషులు తోట కిష్టమ్మ భూమలింగం జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు ఏర్పాటుచేసిన చారిటబుల్ ట్రస్ట్‌ను గురువారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్లు ఎన్‌సి. రాజమౌళి, గాడిపల్లి భాస్కర్, పురోహితులు దేశపతి రాజశేఖరశర్మ, నందబాలశర్మలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తోట భూమలింగం ప్రథమ వర్ధంతి సందర్భంగా వారి జ్ఞాపకార్థం వారి కుమారులు బిక్షపతి, వెంకటేశంలు కుటుంబసభ్యులతో కలిసి చారిటబుల్ ట్రస్టును ఏర్పాటుచేసి ప్రజలకు సేవ చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. మొదటి సేవాకార్యక్రమంలో భాగంగా వృద్ధులకు దుప్పట్లు, స్టీల్ ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేసినట్లు తెలిపారు. రాబోయే కాలంలో నిరుపేదలకు సహాయం చేసే విధంగా ట్రస్ట్ కొనసాగించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో లింగారెడ్డిపల్లి ఉపసర్పంచ్ తోట శ్రీనివాస్, డాక్టర్ నరేష్‌బాబు, మనోహర్‌యాదవ్, ఆర్యవైశ్య నాయకులు, తోటవారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేలకు మాజీ చైర్మన్ శుభాకాంక్షలు

**అడ్డగుట్ట, జనవరి 8, ప్రభాతవార్త:**
నూతన సంవత్సరాన్ని పురస్క రించుకొని బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్. శ్రీనివాస్ సికిం ద్రాబాద్ ఎమ్మెల్యే పద్మా రావు గౌడ్,సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీని వాస్ యాదవ్, మల్కా జిగిరి ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్ రెడ్డి, చామకూర మల్లారెడ్డిలను గురువారం వారి వారి నివాసాలకు వెళ్లినూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ అయ్యప్ప స్వామి ప్రసాదం అందజేశారు.

## నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

**అదనపు కలెక్టర్ జితేందర్‌రెడ్డి**

**హైదరాబాద్, జనవరి 8, ప్రభాతవార్త:**
పదవ తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) జి. జితేందర్ రెడ్డి అధికారులకు సూచిం చారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొని ఎస్.ఎస్.సి యాక్షన్ ప్లాన్ అలాగే ప్రీమెట్రిక్ ఉపకారవేతనాల దరఖాస్తుల పురోగతి పై జిల్లా విద్యాధికారి, జిల్లా సంక్షేమ అధికారులతో కలిసి సమీక్షించారు. పదవ తరగతిపరీక్షలకు హాజరుకానున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, రివిజన్ టెస్టులు, అభ్యాసం సులభతరం చేసేందుకు "అభ్యాస దీపిక" పేరుతో స్టడీ మెటీరియల్, అలాగే సాయంకాలం ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు అల్పాహారం అందించడం జరుగుతుందని జిల్లా విద్యాధికారు ఈరోహిణి తెలిపారు. నూరుశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా అలాగే విద్యార్థులు ప్రముఖ కళాశాలల్లో సీటు పొందేందుకు అత్యున్నత మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా ముందున్న 60 రోజులు కృషి చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.

తదుపరి ప్రీమెట్రిక్ ఉపకారవేతనాల దరఖాస్తుల పై సంక్షేమ శాఖాధికారులను సమీక్షించారు. అర్హులైన ప్రతీ విద్యార్థి ఈ పథకం నుండి ప్రయోజనం పొందేలా చూసేందుకే చివరి తేదీ పొడిగించబడినందున, దీనిపై ప్రత్యేక దృష్టి సారించి అర్హులైన ప్రతీ విద్యార్థి ఈ పథకం కింద నమోదు చేసుకునేలా చూడాలని సూచించారు. దరఖాస్తుకు కావలసిన కుల, ఆదాయ పత్రాలు విద్యార్థులకు త్వరితగతిన అందేలా చూడాలని రెవిన్యూ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారులు, గురుకులాల కోఆర్డినేటింగ్ ఆఫీసర్లు, పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ రాణి మల్లేశం

## రైతులకు మేలు 'ఉపాధి హామీ పథకం'
### -సర్పంచ్ రాణి మల్లేశం

**మర్కుక్, జనవరి 8 (ప్రభాతవార్త):** రైతులకు మేలు చేకూరేలా ఉపాధి హామీ పథకంలో వ్యవసాయ పనులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు మర్కుక్ గ్రామ సర్పంచ్ బి.రాణి మల్లేశం తెలిపారు. గురువారం మర్కుక్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ రాణి అధ్యక్షతన ఉపాధిహామీ పథకం లో చేపట్టనున్న పనులపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ టిపిఎ స్వామితో కలిసి సర్పంచ్ మాట్లాడుతూ జాబ్ కార్డుల ఆధారంగా పనులను నిర్ణయిస్తామని, ప్రస్తుత ఆర్థికసంవత్సరంలో భూగర్భ జలాల పెంపు, వ్యవసాయ పనులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. పశువులు, మేకలు, గొర్రెల షెడ్లు, పండ్ల తోటల పెంపకం, మట్టి రోడ్ల నిర్మాణం, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటడం, నర్సరీల ఏర్పాటు వంటి పనులను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రైతులకు అదనపు ఆదాయం వచ్చేలా మామిడి, కొబ్బరి, జామ, సీతాఫలం, మునగ, డ్రాగన్ ఫ్రూట్ వంటి పండ్ల తోటల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సాయిని మహేష్, పంచాయతీ కార్యదర్శి శాంతి, మాజీ సర్పంచ్ భాస్కర్, వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పార్టీ జిల్లా ఫిషరీస్ ప్రధాన కార్యదర్శి వెంకట్‌కు సత్కారం



కాంగ్రెస్ పార్టీ ఫిషరీస్ జిల్లా ప్రధాన కార్యదర్శిని సత్కరిస్తున్న దృశ్యం

**చిన్నకోడూరు, జనవరి 8, ప్రభాతవార్త :** గంగపుత్ర చైతన్య సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సుందరయ్య విజ్ఞాన కళావేదికలో కాంగ్రెస్ పార్టీ ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్ పాల్గొని సన్మానించారు. ఈ కార్యక్రమంలో చిన్నకోడూరుకు చెందిన కాంగ్రెస్ పార్టీ ఫిషరీస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకట్‌ను శాలువ, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గంగపుత్ర చైతన్యసమితి అధ్యక్షుడు మంగిల పల్లి శంకర్, గంగపుత్ర సంఘం ప్రతినిధులు గుడిసె ప్రభురాజ్, దేశెట్టి బిక్షపతి, సర్పంచ్‌లు, వార్డుసభ్యులు, ఉపసర్పంచ్‌లు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతే టిఎన్‌జివో లక్ష్యం
### జిల్లా అధ్యక్ష, కార్యదర్శి పరమేశ్వర్, విక్రమ్‌రెడ్డి



ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్, జనవరి 8, ప్రభాతవార్త :** మహిళా సాధికారతే లక్ష్యంగా టీఎన్జీవో పని చేస్తుందని జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి కోమండ్ల విక్రమ్‌రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో గురువారం తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ జిల్లా ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మహిళా ఉద్యోగులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎప్పుడూ పనిలో ఉండే మహిళా ఉద్యోగులకు ఉపశమనం కలగడంతోపాటు సంతోషం కోసం ఇలాంటి పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వివిధ సంక్షేమ పథకాలను ముగ్గుల రూపంలో మహిళా ఉద్యోగులు వేదయం జరిగిందన్నారు. ముగ్గుల పోటీలలో విజేతలతో పాటు పాల్గొన్న ప్రతిఒక్కరికి బహుమతి అందించడం జరుగుతుందన్నారు. అలాగే సిద్దిపేట యూనిట్ సంక్షేమ వసతి గృహాల అధికారుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు హరికృష్ణ, నిమ్మ సురేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, నగేష్, సుమన్, శశిధర్, సత్యనారాయణ, వినయసుకుమారి, అరుణ, అనురాధ, జమునరాణి, శ్వేత, ప్రియాంక,మౌనిక, మంజుల, కృష్ణమూర్తి, సాయిశ్రీకాంత్, గణేష్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్విజ్ పోటీలు



క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

**సిద్దిపేట అర్బన్, జనవరి 8, ప్రభాతవార్త :** అలియన్స్ జిల్లా గవర్నర్ గందె ఈశ్వర్‌చరణ్ ఆధ్వర్యంలో గురువారం జిల్లావ్యాప్తంగా 270 ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ఏకకాలంలో సైన్స్ క్విజ్ పోటీలు ఘనంగా నిర్వహించారు. 6,7,8 క్లాస్ విద్యార్థులకు జూనియర్‌గా 9,10 తరగతి విద్యార్థులకు సీనియర్ టెస్ట్ నిర్వహించారు. పోటీలలో మొదటి, ద్వితీయ ర్యాంకు సాధించిన విద్యార్థులకు, విజేతలకు సౌత్ మల్టీపుల్ లేవలుగా నగదు పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అలియన్స్ ప్రతినిధులు వైకుంఠం, ఆత్మారాములు, వనజ, శివకుమార్, ధనుంజయ, రామచంద్రం, వెంకటేశం, విఠల్, కైలాసం, రేణుకా, మధుసూదన్, లక్ష్మతి, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**కొండపాక, జనవరి 8, ప్రభాతవార్త :** తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో, జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు దుద్దెడ తెలంగాణ సోషల్ వెల్ఫేర్ విద్యాసంస్థల వైస్ ప్రిన్సిపల్ స్వప్నజ్యోతి తెలిపారు. గురువారం ఆమె పాఠశాలలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా 6, 7, 8 తరగతుల్లో గురుకుల విద్యాసంస్థల్లో చేరడానికి ఈ నెల 21 వరకు అన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. గురుకులాల్లో నాణ్యమై విద్యాతోపాటు ఉచిత వసతి, డ్రెస్‌లు, మెను ప్రకారం పోషకాహారం అందించడం జరుగుతుందన్నారు. అసక్తికలిగిన విద్యార్థులు ఈ అవకాశన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దీనికి సంబంధించి ఫిబ్రవరి 25న జరిగే అర్హత పరీక్షల్లో ఉత్తీర్ణులైనవారికి మాత్రమే గురుకుల విద్యాలయాల్లో సీట్లు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఆమెవెంట అధ్యాపక బృందం సభ్యులు గాజుల నరేష్, రాజు, బాలమణి, క్రిష్ణ, మణివర్మ పాల్గొనారు.

# అర్చక, ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### అర్చక, ఉద్యోగుల జెఎసి రాష్ట్ర చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, కన్వీనర్ డి.వి.ఆర్.శర్మ




మాట్లాడుతున్న జెఎసి నేతలు

**కొమురవెల్లి, జనవరి 8, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని దేవాలయాల మనుగడకు, ఆధ్యాత్మిక వైభవానికి మూలస్తంభాలైన అర్చకులు, ఉద్యోగుల పట్ల ప్రభుత్వం మానవీయ కోణంలో స్పందించాలని తెలంగాణ దేవాలయ అర్చక,ఉద్యోగుల జెఎసి రాష్ట్ర చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, కన్వీనర్ డి.వి. ఆర్.శర్మ కోరారు. మండల కేంద్రంలోని శ్రీకొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాస్థాన కళ్యాణ మండపంలో గురువారం నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా అర్చక, ఉద్యోగుల జెఎసి సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. దేవాదాయశాఖలో నెలకొన్న వేతన వ్యత్యాసాలు, పెండింగ్‌లోఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆదాయం ఆర్జిస్తున్న 686 దేవాలయాల్లో వేలాది మంది సిబ్బంది దశాబ్దాలుగా సేవలు అందిస్తున్నారని, వీరిలో నేటికీ కేవలం రూ.1500 నుంచి రూ.6 వేల మధ్య వేతనాలతో జీవితాలను గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్ పూర్తిస్థాయిలో అమలు చేయాలని జీవో 577 ప్రకారం అర్హత ఉన్న 5625 మంది అర్చక ఉద్యోగులకు తక్షణమే గ్రాంట్ ఇన్ ఎయిడ్ వర్తింప చేయాలని, ప్రస్తుతం 2622 మందికి మాత్రమే ఈ ప్రయోజనం అందుతుందన్నారు. అర్హులైన వారికి వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. దేవాలయాల్లో మూడేళ్ల కనీస సర్వీసు పూర్తి చేసుకున్న తాత్కాలిక ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరణ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అర్చక ఉద్యోగులకు ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. మూడేళ్లుగా నిలిచిపోయిన పిఆర్‌సి, పెండింగ్‌లో ఉన్న స్పెషల్ ఇంక్రిమెంట్లను విడుదల చేయాలని, హెల్త్‌కార్డులు అందించాలన్నారు. ప్రభుత్వం తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. సమావేశంలో ఉమ్మడి మెదక్ జిల్లా దేవాలయశాఖ అధ్యక్షుడు కృష్ణమాచారి, ఉద్యోగ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రతినిధులు మల్లికార్జున్, ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, భాస్కర్, విరి, వినయ్, బసవేశ్వర్, సాయి, పి.మల్లికార్జున్, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకులు చంద్రశేఖర్, అంజనేయులు, ఉమ్మడి జిల్లాలోని 400 మంది అర్చక, ఉద్యోగులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డిఈఒ శ్రీనివాస్‌రెడ్డి

## ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి : డిఇవో

**కొండపాక, జనవరి 8, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అంకితభావంతో ఉపాధ్యాయులు పనిచేయాలని జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కుకునూరుపల్లి మండల పరిధిలోని పలు పాఠశాలలను ఆయన గురువారం సందర్శించారు. విద్యార్థులకు చదవడం రాయడంతోపాటు గణిత భావానాలను పెంపొందించాలన్నారు. ప్రతి విద్యార్థికి అన్ని అంశాల్లో విజ్ఞానాన్ని అందించాలని కోరారు. ఫిబ్రవరిలో జాతీయ విద్యా సర్వే జరుగుతుందని అందుకోసం ప్రతి పాఠశాలల్లో మూడవ తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. అపరీక్షల ద్వారా విద్యారంగంలో ఏ స్థానంలో ఉందో తెలిసిపోతుందన్నారు. విద్యార్థులకు ఇంగ్లీష్, గణితం సజ్జెక్ట్‌లపై ప్రాక్టీస్ చేయించాలని సూచించారు. హనుమన్‌నగర్, మాత్‌పల్లి, కోనాయిపల్లి, వడ్డెరకాలని, కాశనగర్, కోలోనివంపు, నరాముపల్లి, వెంకటపూర్ తదితర పాఠశాలలను అయన సందర్శించారు. అయన వెంట ఎంఈఒ బచ్చలి సత్తయ్య, సిఆర్‌పి సంతోష్, అయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పైసలిస్తేనే ఇందిరమ్మ ఇళ్లకు బిల్లులు

**సదాశివపేట, జనవరి 8 (ప్రభాతవార్త):** పైసలిస్తేనే ఇందిరమ్మ ఇళ్లకు బిల్లులు ఇస్తున్నారని మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహ్మద్ యాసీన్ ఆరోపించారు. గురువారం మునిపల్లి మండలం బుదేరా చౌరస్తాలో ఆయన మాట్లాడుతూ ఇబ్రహీంపూర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా ప్రకటించినప్పటికీ అధికారులు పైసలకు కక్కుర్తి పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి నుంచి ప్రాజెక్ట్ అధికారి వరకు అవినీతికి పాపాడుతున్నారన్నారు. తాము కట్టిన ఇళ్లకు ఇనుప ఊచలు పక్కింటికి తగిలాయాన్న సాకుతో బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. తమ లాగే కట్టిన ఇళ్లకు ఎందుకు బిల్లులు చెల్లించారని పీడీని ప్రశ్నిస్తే జవాబు దాట వేస్తున్నారన్నారు. ఉన్నతధికారులకు చేయితడపనిదే బిల్లులు రావని పంచాయతీ సెక్రటరీ రవి అనడం అధికారుల అవినీతికి నిదర్శనం అన్నారు.తమ బిల్లుల కోసం ఏఈకి అనేక సార్లు అడిగిన పట్టించుకోవడం లేదన్నారు.ఇకనైనా అధికారులు నిజాయితీ గా పని చేయాలని లేని యెడల మంత్రి కి,జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తానన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగ్గుల పోటీలు

**హుస్నాబాద్ టౌన్, జనవరి 8, ప్రభాతవార్త :** హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం సంక్రాంతి పర్వదిన ముందస్తు వేడుకలో భాగంగా విద్యార్థినిలు వివిధ రకాలైన ముగ్గులతో కళాశాలను శోభాయ మానంగా తీర్చి దిద్దారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయగిరి బిక్షపతి మాట్లాడుతూ ముగ్గులు మన సంప్రదాయానికి ప్రతీకలని, అవి సృజనాత్మకతను ప్రతిబింబిస్తాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ షబీఫాతిమా, సుధామాధురి, లక్ష్మి, రాజ్యలక్ష్మి జడ్జిలుగా వ్యవహరించి ప్రతిభాపాటవాలు చూపిన విద్యార్థులను ఎంపిక చేశారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అనిల్‌కుమార్, కుమారస్వామి, చంద్రమోళి, నైనా దేవి, బాలరాజు, అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.



ముగ్గులు వేసిన విద్యార్థులతో ఉపాధ్యాయులు



క్రీడకారులతో కరచాలనం చేస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

## యువత క్రీడల్లోనూ రాణించాలి
### వంటేరు ప్రతాప్‌రెడ్డి

**కొండపాక, జనవరి 8, ప్రభాతవార్త:** యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని బిఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి, ఐఎస్ అధికారి బుద్ధి అఖిల్ అన్నారు. గురువారం కొండపాకలో అనంతుల ప్రశాంత్ చారిటెబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో మాజీ ఎంపిపి అనంతుల శారద స్మారకార్థం ఏర్పాటు చేసిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంటును వారు ముఖ్య అతిథితులుగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడారు. క్రీడల వల్ల శారీరదారుడ్యంతోపాటు మానసిక అనందం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ అనంతుల ప్రశాంత్, సర్పంచులు సంజీవరెడ్డి, గాలి బాలయ్య, మిద్దె శివకుమార్, మంచాల నవీన నాయకులు జ్యోతి బాలస్వామి, సుజాత అకోక్, యాదవ్వ ఎల్లం, కోడెల రవీందర్, జైపాల్‌రెడ్డి, బాలబ్రహ్మం, ఎల్లం, జీర్రరాజు, అంబటి బానుచందర్, యాదగిరి, బోద్దుల తిరుపతి, రాములు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశ నుంచి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి
### -గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి

**గజ్వేల్, జనవరి 8 (ప్రభాతవార్త):** విద్యార్థులు విద్యార్థి దశ నుండి ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి సూచించారు. గురువారం గజ్వేల్ పట్టణంలోని ఎక్స్‌వీర్స్ టెక్నానో హైస్కూల్ విద్యార్థులకు రోడ్డు భద్రత మరియు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మురళి మాట్లాడుతూ మైనర్లు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడపవద్దని తెలిపారు. కారణము లేని మరణం ఒక రోడ్డు ప్రమాదం మాత్రమే అని, వాహనదారులు తప్పకుండా రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. విద్యార్థులు రోడ్డుపై నడిచేటప్పుడు ఎడమవైపు మాత్రమే నడవాలని సూచించారు. విద్యార్థిని, విద్యార్థులు నేర్చుకున్న ట్రాఫిక్, రోడ్డు నిబంధనల గురించి తల్లిదండ్రులకు తెలియజేయాని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మంజీర నదిలో మహిళ మృతదేహం లభ్యం

**పుల్‌కల్, జనవరి 8, ప్రభాతవార్త:** సింగూరు ప్రాజెక్టుకు దిగువ భాగంలోని మంజీర నదిలో ఓ మహిళ మృతదేహం గురువారం లభ్యమయింది. ఇందుకు సంబంధించి ఎస్ఐ ఎన్ విశ్వజన్ కథనం ప్రకారం... వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట మండలం యావాపూర్ గ్రామానికిచెందిన వడ్డె రాములమ్మ (45)గా గుర్తించామన్నారు. ఈ నెల 6వ తేదీన పని ఉందని, సదాశివపేటకు వెళ్లున్నానని మరదలు పోచమ్మతో చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయిందన్నారు. పనికని వెళ్లిన రాములమ్మ సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు మొబైల్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అని వచ్చిందన్నారు. సింగూరు ప్రాజెక్టు వద్ద మంజీరనదిలో మహిళ మృతదేహాన్ని పరిశీలించగా రాములమ్మగా గుర్తించామన్నారు. మృతురాలు రాములమ్మ అల్లుడు వడ్డే శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విశ్వజన్ వివరించారు.

### పోయిన బంగారు గొలుసు బాధితురాలికి అప్పగింత

**మెదక్, జనవరి 8, ప్రభాతవార్త:** పోగొట్టుకున్న బంగారు గోలుసును చిన్నశంకరంపేట పోలీసులు గురువారం బాధితురాలికి అందించారు. ఎస్ఐ నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.... భాగ్యనగరం అల్వాల్‌కు చెందిన సరిత,సుధాకర్‌లు బుధవారం మెదక్‌లోని బందువుల ఇంటిలో అంత్యక్రియలకు హజరై కారులో ఇంటికి తిరిగి వెళ్తున్నారు. రాత్రి 7 గంటలకు గవ్వలపల్లి చౌరస్తాలో కారు దిగి చాయ్ త్రాగి వెళ్లిపోయారు. ఆ సమయంలో సరిత పర్సు ఎక్కడో పడిపోయిందని, అందులో తులం బంగారు గోలుసు ఉందని బాధితులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టగా సీసీ కెమెరాలను పరిశీలించమని కానిస్టెబుల్ ప్రవిణ్‌కు గవ్వలపల్లి చౌరస్తాకు పంపించారు. సీసీ కెమెరాల ఆధారంగా పర్సు, చాయ్ దుకాణం వద్ద రోడ్డు పక్కన పడిపోవటాన్ని గమనించి పర్సు‌ను వెతికి పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తీసుకోచ్చి బాధితులకు పర్సు, అందులోని బంగారు గోలుసును అందించారు. ఈ సందర్భంగా కానిస్టెబుల్ ప్రవిణ్‌ను ఎస్ఐ నారాయణగౌడ్ అభినందించారు.

# తప్పుల తడకగా ఓటరు ముసాయిదా జాబిత

### నివాసం ఒక వార్డులో.. ఓట్లు మరో వార్డులో

**సంగారెడ్డి మున్సిపాలిటి జనవరి 8, ప్రభాతవార్త:** మున్సిపాలిటీ ఎన్నికలు త్వరలో నిర్వహించేందుకు రాష్ట్రప్రభుత్వం కసరత్తుచేస్తున్న నేపథ్యంలో ఓటర్ల ముసాయిదా జాబితాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఈనెల 1న సంగారెడ్డి జిల్లాలోని ఆయా మున్సిపాలిటీలలో ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. అధికారులు ప్రచురించిన ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీల నాయకులు పలువురు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. నివాసం ఉంటున్నది ఒకచోట అయితే, పేరు మరో వార్డులో నమోదు చేశారని మొత్తం కుటుంబ సభ్యుల పేర్లు ఒకచోట కాకుండా వేరు వేరు వార్డులలో నమోదు అయ్యాయని, గత ఎన్నికల జాబితా ఆధారంగా ప్రచురించిన జాబితాలో తన పేరు సక్రమంగానే ఉన్నాయని, కానీ ప్రస్తుతం అధికారులు ప్రచురించిన జాబితా తప్పులు తడకగా మారిందని వారు ఆరోపిస్తున్నారు. ఇదే విషయంపై రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, మరికొన్నింటిపై రాతపూర్వక ఫిర్యాదులు చేశామని వారు పేర్కొన్నారు. ఈ నెల 4 వరకు ఓటర్ల జాబితాలపై ఫిర్యాదులను అదికారులు స్వీకరించారు. ఓటర్ల ముసాయిదా తుది జాబితాను ఈ నెల 12న విడుదల చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు ఈనెల 5న సంగారెడ్డి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో వివిధ రాజకీయ పక్షాల నాయకులతో కమిషనర్లు ముసాయిదా ఓటరు జాబితా పై సమావేశాలు నిర్వహించి ఫిర్యాదులను స్వీకరించారు. అదేవిధంగా మంగళవారం జిల్లాస్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో కలెక్టర్ ప్రావీణ్య సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాలపై చర్చించారు. పిర్యాదులను సంబంధితఅధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లాలోని 11 నుంచి పార్టీలకు సంబంధించి 256 వార్డులలో ముసాయిదా జాబితాను విడుదల చేశామని కలెక్టర్ ఈ సందర్భంగా సమావేశంలో తెలిపారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లతో ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ నెల 12న తుది ఓటర్ల జాబితాను విడుదల చేయాలని అధికారులను ఆదర్శించారు. మున్సిపల్ ఎన్నికలకు అడుగులు వడివడిగా పడుతున్నడంతో అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణకు నిమగ్నమైంది ఓటరు జాబితాపై వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో సంబంధిత మున్సిపల్ సిబ్బంది, అధికారులు నిమగ్నమై ఉన్నారు. వచ్చిన అభ్యంతరాలపై నిశితంగా పరిశీలిస్తున్నారు, ఫిర్యాదుదారులు కూడా తమ ఫిర్యాదుల పరిష్కారం ఎంతవరకు వచ్చిందో అంటూ తెలుసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు వార్డులలో ఓట్ల గల్లంతు ఇతర వార్డుల ఓట్లు, మరో వార్డులో వచ్చినట్లయితే ఎన్నికల సమయంలో ఇబ్బందులు తప్పవని వారు ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది.

## విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలి : ప్రిన్సిపాల్

**సిద్దిపేట అర్బన్, జనవరి 8, ప్రభాతవార్త :** విద్యార్థులు బాగా చదువుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జీవన్‌కుమారు అన్నారు. జిల్లా కేంద్రంలోని మైత్రివనం పరిధిలో గల మహిళ డిగ్రీ కళాశాలలో గురువారం కామర్స్ ఫెస్టివల్(ఫుడ్ ఫెస్టివల్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకొని ముందుకు సాగాలన్నారు. సిద్దిపేటలో మహిళా అభివృద్ధికి యూనియన్ ఆర్సిటీ ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఉపాధి పొందాలనుకునేవారు శిక్షణ కోసం అందులో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సాంస్కృతి సంప్రదాయాలతో పాటు చదువులోనూ ముందుండాలన్నారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల పుట్ ఐటమ్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌సిటి డైరెక్టర్ గేమునాయక్, పాపయ్య, సువర్ణాదేవి, శంకరాచార్యులు, రాములు తదితరులు పాల్గొన్నారు.

## నట్టల నివారణ మందు పంపిణీ

**చిన్నకోడూరు, జనవరి 8, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను గొర్రెల కాపరులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ యాట సత్యలక్ష్మీ యాదయ్య అన్నారు. మండల పరిధిలోని మాచాపూర్‌లో గురువారం చిన్నకోడూరు పశువైద్య శాఖ ఆధ్వర్యంలో గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గొర్రెకాపర్లు నట్టల నివారణ మందులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.సీజనల్ వ్యాధులపట్ల గొర్రెలు, మేకలకు సరైన వైద్య సేవలు అందించేందుకు కృషిచేయాలన్నారు. పశువైద్యాధికారి మంజుల మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గొర్రెల నట్టల నివారణ మందులు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువులకు సీజనల్ వ్యాధుల పట్ల పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఏలేటి రవీందర్‌రెడ్డి, నాయకులు పార్థివరెడ్డి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

## మొక్కజొన్న పంటపై రైతులు శ్రద్ధచూపాలి : ఏవో

**మర్కుక్, జనవరి 8 (ప్రభాతవార్త):** యాసంగి సాగులో మొక్కజొన్న పంటపై రైతులు ప్రత్యేక శ్రద్ధవహించాలని మండల వ్యవసాయాధికారి బోయినపల్లి రాము సూచించారు. మండల పరిధిలోని చేబర్తి గ్రామంలో గురువారం సర్పంచ్ ర్యాకం యాదగిరితో కలిసి మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న సాగుకు సంబంధించి రైతులకు పలు సూచనలు చేశారు. ఎకరానికి 80 నుంచి 96 కిలోల నత్రజని, 32 కిలోల భాస్వరం, 32 కిలోల పోటాష్ ఎరువులను మోతాదులో వినియోగించుకోవాలని తెలిపారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నియంత్రణకై విత్తనం మొలకెత్తక ముందు ఎకరానికి 5 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసి పురుగు ఉధృతిని గమనించాలని సూచించారు. పైరును 45 రోజుల వరకు కలుపు లేకుండా ఉంచడం ద్వారా పురుగు ఉధృతిని తగ్గించవచ్చన్నారు. అవసరాన్నిబట్టి సిఫారసు చేసిన మందులతో మాత్రమే పిచికారి చేయాలని, పంటకాలంలో రెండు నుంచి మూడుసార్లకే క్రిమిసంహారక మందులు వాడాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో విష్ణు, రైతులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**మర్కుక్, జనవరి 8 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన గంగమొల్ల వడ్ల నర్సింలు(60) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సేవా ఫౌండేషన్ చైర్మన్ తాండ బాల కృష్ణగౌడ్ గురువారం మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 24వ సేవా కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఆయనతో పాటు దొడ్డ చారి, రుద్రారం భాస్కర్, కాళిదాసు, కొత్వాల రాజు, కుమ్మరి బాలకిషన్ తదిరతులు పాల్గొన్నారు.

## పేద కుటుంబాలకు అండగా ఉంటా : మాజీ ఎంపిపి

**మర్కుక్, జనవరి 8 (ప్రభాతవార్త):** పేద కుటుంబాలకు అండగా ఉంటామని మాజీ ఎంపిపి పాండుగౌడ్, బిఆర్ఎస్ బిసిసెల్ మండల అధ్యక్షుడు మ్యాకల కనకయ్య ముదిరాజ్ అన్నారు. మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన తాడెం రవి అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న పాండుగౌడ్, కనకయ్య గురువారం అతని కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. వారితోపాటు సర్పంచ్ భవాని బాలకిషన్, ఉపసర్పంచ్ జట్టు సుధాకర్, వార్డుసభ్యులు మల్లేష్, శ్రీనివాస్, లక్ష్మణ్, కరుణాకర్, రాజు, కుమ్మరి కరుణాకర్ తదితరులు ఉన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

**మర్కుక్, జనవరి 8 (ప్రభాతవార్త):** మండల కేంద్రానికి చెందిన గద్దల వజ్రమ్మ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం ఉదయం మృతి చెందింది. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మర్కుక్ కరుణాకర్‌రెడ్డి ఆర్థిక సహాయాన్ని పంపించగా స్థానిక బిఆర్ఎస్ నాయకులు మల్లేశం, ఉపసర్పంచ్ సాయిని మహేష్, మాజీ సర్పంచ్ భాస్కర్ అందజేశారు. వారితోపాటు వార్డు సభ్యులు రాజు, నాగరాజు, పుట్ట రవి, నాయకులు సుధాకర్‌రెడ్డి, బబ్బూరి శ్రీనివాస్, శ్రీను, పరశురాములు ఉన్నారు. అలాగే, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బబ్బూరి మల్లేశంగౌడ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, జైపాల్ రెడ్డి, శ్రవణ్‌రెడ్డి, బాబు, నర్సింలు, కిషోర్‌లు వజ్రమ్మ కుటుంబాన్ని పరామర్శించి పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.

## ఆర్థిక సాక్షరతపై అవగాహన

**తొగుట, జనవరి 8, ప్రభాతవార్త :** తొగుట ఎపిఎం కార్యాలయంలో గురువారం ఆర్థిక సాక్షరతపై అవగాహన కార్యక్రమం స్వయం సహాయక సంఘాల మహిళలకు రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌బిఐ ఎల్‌డివో ఎం.జె.రెహమాన్, జిల్లా లీడ్ మేనేజర్ హరిబాబు, ఎపిఎం బాబురావు, ఎస్‌బిఐ మేనేజర్ ప్రదీప్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ జలేందర్, తొగుట సిఎఫ్‌ఎల్ కౌన్సిలర్ స్వామి, శ్రీనివాస్, ఎస్ఈఆర్‌పి శాఖ సిబ్బంది,ఎస్‌హెచ్‌జి మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆర్‌బిఐ ఎజిఎం ఆర్థిక సమగ్రత, సామాజిక భద్రత పథకాలు, ఒంబుడ్స్‌మన్ పథకంపై అవగాహన కల్పించారు. సురక్షిత బ్యాంకింగ్ విధానాల ప్రాధాన్యతను వివరించారు.

## చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాల వద్ద వ్యక్తి వినూత్న నిరసన

**హుస్నాబాద్ రూరల్, జనవరి 8, ప్రభాతవార్త :** మండల పరిధిలోని పందిల్ల గ్రామంలో ఓ ఇంటి యజమాని గురువారం వినూత్న నిరసన తెలిపారు. తమ ఇంటి పక్కన ఉన్న ఖాళీ స్థలంలో వేస్తున్న చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాల వద్ద బైటాయించి ఆందోళన చేపట్టారు. చెత్తతోపాటు ప్లాస్టిక్, పొగాకు వ్యర్థాలను తగలబెట్టడంవల్ల తాము అనారోగ్యం పాలవుతున్నామంటూ ఆవేదన వ్యక్తంచేస్తూ గ్రామంలో ఫ్లాకార్డుతో అర్థనగ్న ప్రదర్శన నిర్వహించారు.ఖాళీస్థలంలో చెత్తనువేసి కాల్చవద్దంటూ ఎన్నిసార్లు చెప్పినా కాలనీవాసులు వినడం లేదంటూ వాపోయారు. తమ ఇంటి పక్కన ఖాళీ స్థలంలో చెత్తవేయకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశాడు.

## విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన ఉండాలి
### మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ యోగేశ్వర్‌సింగ్ జాదవ్

**హుస్నాబాద్ రూరల్, జనవరి 8, ప్రభాతవార్త :** విద్యార్థులు రహదారి భద్రతపై అవగాహన కలిగి ఉండాలని హుస్నాబాద్ మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ యోగేశ్వర్ సింగ్ జాదవ్ అన్నారు. గురువారం కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న జాతీయ రోడ్డు భద్రత మసోత్సవాల సందర్భంగా హుస్నాబాద్‌లోని ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు సెయింట్ జోసెఫ్ పాఠశాలలో రహదారి భద్రత అంశంపై వ్యాసరచన, క్విజ్ పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే విద్యార్థులకు రోడ్డు భద్రత, ప్రమాదాల గురించి అవగాహన కలిగి ఉంటే భవిష్యత్తులో జాగ్రత్తలు పడతారన్నారు. కార్యక్రమంలో ఆర్టిఏ కానిస్టేబుల్ రవీందర్, హోంగార్డ్ వెంకటేష్, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షులు నర్సింహ రెడ్డి, కోశాధికారి శ్రీధర్‌రెడ్డి, జోసెఫ్ స్కూల్ ప్రిన్సిపాల్ విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యోగేశ్వర్ సింగ్ జాదవ్

## సర్పంచిని సన్మానించిన పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి



ఎర్రబొగడ సర్పంచిని సన్మానిస్తున్న పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి

**నాగల్‌గిద్ద, జనవరి 8, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని ఎర్రబొగడ గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన మనోహర్ పాటిల్ గురువారం గ్రామ కాంగ్రెస్ నాయకులతో కలిసి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈసందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి సర్పంచి మనోహర్‌పాటిల్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా పాలన సాగించాలని సర్పంచి మనోహర్‌పాటిల్‌కు చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు.

## ఒకే పాఠశాలలో 42 ఏళ్ల విధి నిర్వహణ

**-పదవీ విరమణతో సన్మానించి వీడ్కోలు**



అటెండర్ దంపతులను సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయులు

**సిర్గాపూర్, జనవరి 8, ప్రభాతవార్త:**
మండలంలోని బొక్కస్కాం ప్రాథమిక పాఠశాలలో అటెండర్‌గా 4 దశాబ్దాలకు పైగా (42 ఏళ్లు) పనిచేసి గురువారం పదవీవిరమణ పొందిన పీరయ్య దంపతులను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింగ్, గ్రామసర్పంచి పద్మినిదత్తురావు, ఉపాధ్యాయులు పీరయ్య దంపతులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజు, సురేష్, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు, పోషకులు పాల్గొన్నారు.

## క్యాలెండర్‌ను ఆవిష్కరించిన అధ్యక్షులు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యక్షులు రాజ్‌కుమార్ దేశ్‌పాండే

**జహీరాబాద్, జనవరి 8, ప్రభాతవార్త:**
బ్రాహ్మణ సేవాసమాజ్ సంస్థ జహీరాబాద్ డివిజన్ నూతన ఆంగ్ల సంవత్సరం 2026 క్యాలెండర్‌ను గురువారం పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని సమితి అధ్యక్షులు రాజ్‌కుమార్ దేశ్‌పాండే ఆవిష్కరించారు. కార్యక్రమంలో పునీత్‌దీక్షితులు, పరమేశ్వరయ్య, కిరణ్‌పురోహిత్, వసంతరావుకులకర్ణి, మహిళా అధ్యక్షురాలు సరస్వతికులకర్ణి, ఉపాధ్యక్షురాలు నర్మదాదేశ్‌పాండే, ప్రధానకార్యదర్శి అఖిలజోషి, కోశాధికారి భవాని కులకర్ణి, కార్యవర్గసభ్యులు మంజులకులకర్ణి, గాయత్రిఅయ్యర్, లక్ష్మి, సువర్ణకుల కర్ణి, కపిలకులకర్ణి తదితరులు పాల్గొన్నారు.

**అంగరంగవైభవంగా**

## గురు గంగాధరమహాస్వామి జయంతి



గురు గంగాధరస్వామిని సన్మానిస్తున్న దృశ్యం

**సదాశివపేట, జనవరి 8, ప్రభాతవార్త:**
సదాశివపేట మండలం తంగడపల్లి గ్రామంలో వెలిసినటువంటి శ్రీకోటి బిల్వ లింగేశ్వరమఠం గురు గంగాధరమహాస్వామి ఆశ్రమం జంగమయ్య గుట్టక్షేత్రంలో గురు గంగాధరమహాస్వామి జయంతిని పురస్కరించుకొని గోపూజ నూతనంగా గురువుగారి మందిర ద్వారపూజ, గురువుగారి పాదుకలకు విశేషమైన అభిషేక పూజాకార్యక్రమం శివయోగి శివాచార్య మహాస్వామి వారి కరకమలములచే నిర్వహించారు. తదుపరి ఆశ్రమ ప్రాంగణంలో తెలంగాణరాష్ట్రంలో నూతనంగా ఎన్నుకోబడినటువంటి వీరశైవ లింగాయత్, ఆశ్రమభక్తులు సర్పంచులుగా, ఉపసర్పంచులుగా వార్డుమెంబర్లుగా గెలుపొందడంతో, అప్పగారు వారిని సత్కరించి మంగళాశీస్సులు అందజేశారు. తదుపరి ఆశ్రమ 30వ వార్షికోత్సవాలు ఫిబ్రవరి 2నుండి ఫిబ్రవరి 8వరకు నిర్వహించే విశేష కార్యక్రమాలకు సంబంధించిన ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలుజిల్లాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డ్‌మెంబర్లు, వీరశైవలింగాయత్ సమాజం సభ్యులు అర్చక, పురోహితులు తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఏడిఏ బిక్షపతి, డాక్టర్ గిరి

**జహీరాబాద్, జనవరి 8, ప్రభాతవార్త:**
జహీరాబాద్ పద్మశాలి సంఘం ఏర్పాటు చేసిన 2026 నూతన ఆంగ్ల సంవత్సరం క్యాలెండర్‌ను గురువారం పట్టణంలోని పద్మశాలి భవన్‌లో వైద్యులు పట్నం గిరి, వ్యవసాయ శాఖ ఏడిఏ బిక్షపతిలు ఆవిష్కరించారు. పద్మశాలి సంఘం అధ్యక్షులు గడ్డం జనార్ధన్ ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరైన ప్రముఖులను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి పద్మారమేష్, కోశాధికారి రంగా అరుణ్‌కుమార్, కార్యనిర్వాహక సభ్యులు ఎన్నం రఘు, సంఘం ఉపాధ్యక్షులు కనుకుంట్ల నర్సింలు, పగిడిమర్రి రాములు, కొండా శివరాజ్, ముఖ్య సలహాదారులు దోమల పండరి, పండాలి ప్రభు, పెగడ శ్రీనివాస్, సగ్గం శ్రీనివాస్, చిప్ప సత్యనారాయణ, కరదాస్ ప్రేమ్, గంజోటి విజయ్, సగ్గం చంద్రశేఖర్, గడ్డం పాండులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

**-ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు**

**జహీరాబాద్, జనవరి 8, ప్రభాతవార్త:**
జహీరాబాద్ పట్టణంలోని రాచన్నపేటకు చెందిన అప్పం రజిత బతుకు తెరువుకోసం హైద్రాబాద్‌లోని బోరబండలో ఉంటూ జీవనం సాగిస్తుండగా రజిత కుమారుడు నందకిషోర్(14) వారంరోజులక్రితం గాలిపటం ఎగరేసుకుంటూ ప్రమాదావశాత్తు విద్యుత్‌వైర్లకు గాలిపటం చిక్కుకోవడంతో షాక్ తగిలి బాలుడిశరీరం కాలిపోవడంతో ఆసుపత్రిలో చికిత్స అందుకుంటూ రెండురోజుల క్రితం మృతిచెందినట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు రజిత నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఎమ్మెల్యేతోపాటు మాజీ మున్సిపల్ చైర్మన్ తంజి, నాయకులు నామ రవికిరణ్, మోహియుద్దీన్, బండి మోహన్, ఆర్ సుభాష్, నందుగౌడ్, తులసి మక్కని పాల్గొన్నారు.

# అక్రమ మట్టి రవాణాదారులపై చర్యలు తీసుకోండి

**-జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు ఖాజిపేట రాజేందర్**



అక్రమ మట్టి రవాణాజరిపిన మాదన్నకుంటచెరువు వద్ద దర్యాప్తుచేస్తున్న ఐబి ఎఈ ప్రభాసిబ్బంది

**కౌడిపల్లి, జనవరి 8, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని వెల్మకన్నె గ్రామ పంచాయతీ శివారులోని సర్వే నం.447లోగల మాదన్నకుంట నుండి ఈనెల 6వ తేదీ అర్ధరాత్రి నుండి తెల్లవారు ఝామువరకు అక్రమంగా మట్టిని జెసిబి సహాయంతో తోడి, ధర్మాసాగర్ వెళ్లే దారిలోని వెంచర్‌లోనికి అక్రమంగా మట్టిని తరలించిన రవాణాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ నీటి పారుదలశాఖ డిఈఈకి వ్రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ఖాజిపేట రాజేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వెల్మకన్నె గ్రామనూతన సర్పంచి భర్త, మాజీ వైస్ ఎంపిపిల ప్రమేయంతో వాల్టా చట్టాన్ని తుంగలో తొక్కి మాదన్నకుంట నుండి అక్రమంగా మట్టిని రవాణా చేయడం జరుగుతుందని ఆయన ఆరోపించారు. ఇట్టి అక్రమమట్టి రవాణాకు పరోక్షంగా కొందరు మద్దతు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ విషయంపై మండల నీటిపారుదల శాఖాధికారులకు సమాచారం అందించిన ఆలస్యంగా వచ్చి చెరువులో ఐబి ఏఈ ప్రభా తన సిబ్బందితో తుతుమంత్రంగా దర్యాప్తు చేసినట్లు ఆయన తెలిపారు. ఇప్పటికైనా జిల్లా ఐబి ఉన్నతాధికారులు, డిఈఈలు సమగ్ర దర్యాప్తు చేసి అక్రమంగా మట్టి తరలింపు కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## వాసర్‌లో రైతు పొలం బడి



వాసర్‌లో రైతు పొలం బడి నిర్వహిస్తున్న దృశ్యం

**సిర్గాపూర్, జనవరి 8, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని వాసర్ గ్రామంలో కేంద్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ వారి కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం హైద్రాబాద్, వ్యవసాయశాఖల ఆధ్వర్యంలో గురువారం ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ బసవన్న పర్యవేక్షణలో శనగలో రైతు క్షేత్ర పాఠశాలను నిర్వహించారు. ఈసందర్భంగా బసవన్న రైతులకు సమగ్ర సస్యరక్షణ అవసరాల గురించి వివరించారు. విత్తనశుద్ధి ఎలా చేయాలి అన్న దానిపై డెమో నిర్వహించి విత్తనశుద్ధితో కలిగే ప్రయోజనాలపై వివరించారు. అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఉదయ్‌శంకర్ మాట్లాడుతూ మిత్రపురుగులు, శత్రుపురుగుల గురించి, జీవ నియంత్రణ పద్ధతుల గురించి పేర్కొన్నారు. నారాయణఖేడ్ ఏడిఓ నూతన్‌కుమార్ మాట్లాడుతూ రైతులు విధిగా సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలని, యూరియా అవసరాలకు మించి వినియోగించరాదన్నారు. మండల వ్యవసాయ అధికారి హరీష్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులకు వివరించారు. జొన్న, శనగ పంట పొలాలను అధికారులు పరిశీలించి రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచి హనుమంతు, ఏఈఓ సంజీవ్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## పేరైనా మార్చండి-కార్యాలయాన్నైనా మార్చండి

**-జిహెచ్‌ఎంసి కమిషనర్‌కు కార్పొరేటర్ సింధు వినతి**



జిహెచ్‌ఎంసి కమిషనర్‌కు వినతిపత్రం అందచేస్తున్న కార్పొరేటర్ సింధు

**రామచంద్రాపురం, జనవరి 8, ప్రభాతవార్త:**
అమీన్‌పూర్ సర్కిల్‌కు పేరైనా మార్చండి లేదా కార్యాలయాన్ని అయినా రామచంద్రాపురానికి తరలించాలని గురువారం భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శరెడ్డి జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్‌కు వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా కార్పొరేటర్ సింధు ఆదర్శరెడ్డి మాట్లాడుతూ రామచంద్రాపురం ప్రాంతం ప్రధాన రహదారిపై ఉండటంతోపాటు మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని, ప్రజలకు, వృద్ధులకు తమ పనులను రామచంద్రాపురంకు చేరుకుని సులువుగా చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈవిషయమై తగునిర్ణయం తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ వివరించారు.

### వరి నారుమడులను పరిశీలించిన ఏడిఏ

**జహీరాబాద్, జనవరి 8, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన సిర్గాపూర్‌లో రైతులు వేసిన వరి నారుమడులను గురువారం నారాయణఖేడ్ ఏడిఏ నూతన్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ, సర్పంచ్ శ్రీనివాస్‌రావులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఏడిఏ నూతన్‌కుమార్ మాట్లాడుతూ చలితీవ్రత మూలంగా వరినారు దెబ్బతిందని, చలి తీవ్రతను తట్టుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏడిఏ రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ భాస్కర్, శివకుమార్, రఘునాథ్, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

### అల్లాదుర్గంలో ఇందిరమ్మ చీరెల పంపిణీ

**అల్లాదుర్గం, జనవరి 8, ప్రభాతవార్త:**
ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అల్లాదుర్గం సర్పంచ్ మద్దూరి సౌమ్య అన్నారు. గురువారం మహిళలకు ఇందిరమ్మ చీరెలను సర్పంచ్ సౌమ్య అందచేశారు. కాంగ్రెస్‌ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోందని గుర్తుచేశారు. కార్యక్రమంలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

### ఏఈఈలకు డిఈఈలుగా పదోన్నతులు

**- నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

**హైదరాబాద్, జనవరి 8,ప్రభాతవార్త:**
అర్హతల అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (ఏఈఈ)లు అందిరికీ త్వరలో డిఈఈలుగా పదోన్నతులు కల్పిస్తామని నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈమేరకు గురువారం డా.బిఆర్ అంబేద్కర్ సెక్రటేరియట్‌లో అసోసియేషన్ ఆఫ్ తెలంగా ణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ (ఏటీఏఈఈ)2026 డైరీ, క్యాలెండర్‌ను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి ఎల్. నాగరాజు, రాష్ట్ర కోశాధికారి సంతోష్‌రెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఇంజనీర్ల సమస్యలను మంత్రికి వివరించగా ఆ సమస్యలను వెంటనే పరిష్కారం చేస్తామని హామీ ఇస్తూ ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేసి శాఖకు మంచి గుర్తింపును తేవాలని కోరారు. అదే విధంగా అన్ని అడ్డంకులను అధిగమించి ఇరిగేషన్‌శాఖలో 200 ఏఈఈలకు డీఈఈలు గా పదో న్నతులు కల్పించామని మిగతావారికి కూడా త్వరలోనే ప్రమోష న్స్ ఇస్తామని హామీ ఇచ్చారు.మంత్రిని కలిసిన వారిలో యాదాద్రి భువనగి రి జిల్లా అధ్యక్షుడు మనోహర్,రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ మహేం ద్రనాథ్,జాయింట్ సెక్రటరీ సుష్మ,జయశ్రీ,అరుణ పాల్గొన్నారు.

## ఘనంగా లక్ష్మీ నారాయణ హోమం

**యూసుఫ్‌గూడ జనవరి 8, ప్రభాతవార్త :**
దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని ప్రముఖ సినీ నటుడు తనికెళ్ల భరణి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వద్దేఎ్లల్లి రాజేశ్వర్‌లు అన్నారు. గురువారం మోతీనగర్ కమ్యూనిటీ హాల్ లో స్థానిక సీనియర్ బీజేపీ నాయకులు ఎన్.అంజిరెడ్డి ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీనారాయణ హోమం ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ప్రజలంతా శ్రీ లక్ష్మీనారాయణుని క్రుపకు పాత్రులై ఆయురారోగ్య ఐశ్వర్యాలు సుఖ:శాంతులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విష్ణు భట్ల లక్ష్మీనరసింహ శర్మ, మేడ్చల్ జిల్లా బీజేపీ కార్యదర్శి పులి గోళ్ల శ్రీనివాస్ యాదవ్, విజయ్, సాయిచంద్, అభిలాష్ పాల్గొన్నారు.

## రేజింతల్‌లో ఎలక్ట్రిసిటీ అధికారుల ప్రజాబాట



రేజింతల్‌లో ప్రజాబాట నిర్వహిస్తున్న విద్యుత్ అధికారులు

**సదాశివపేట, జనవరి 8, ప్రభాతవార్త:**
కొన్ని నెలలుగా ఇన్చార్జి అధికారుల పర్యవేక్షణలో ఉన్న గ్రామాలు నేడు నూతన సర్పంచులు బాధ్యతలు తీసుకొని గ్రామాలలో తిష్ఠవేసిన సమస్యలను దారికి తెస్తున్నారు. ఇందులో భాగంగా సదాశివపేట మండలంలోని రేజింతల్ గ్రామంలో సర్పంచ్ ఆశిరెడ్డి కోరిక మేరకు ఎలక్ట్రిసిటీ అధికారులు గ్రామంలో ప్రజాబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తగా వేయవలసిన కరెంటు లైన్లు, ట్రాన్స్ఫార్మర్లు ఇంకా ఏమైనా కరెంటుకు సంబంధించిన సమస్యలు ఉంటే వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి ఆశిరెడ్డితోపాటు ఎలక్ట్రిసిటీ అధికారులు డిప్యూటీ ఇంజనీర్ నెహ్రూనాయక్, ఎడి వీరారెడ్డి, ఎఈ మధుసూదన్‌రెడ్డి, లైన్‌మెన్ ప్రేమ్‌కుమార్, గ్రామపెద్దలు కృష్ణారెడ్డి నవాజ్, రెడ్డిరామ్‌రెడ్డి గ్రామంలోని వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు

**-పెద్దపటేల్ చెరువులోకి చేపపిల్లల విడుదల**



పటేల్‌చెరువులో చేపపిల్లలను వదులుతున్న సర్పంచి సౌమ్య సురేష్‌గౌడ్

**అల్లాదుర్గం, జనవరి 8, ప్రభాతవార్త:**
మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తోడ్పాలు అందిస్తోందని అల్లాదుర్గం సర్పంచి సౌమ్యసురేష్‌గౌడ్, మత్స్యశాఖ అధ్యక్షులు భూమయ్యలు అన్నారు. మండల కేంద్రమైన అల్లాదుర్గంలోని పెద్దపటేల్‌చెరువులో గురువారం ప్రభుత్వం సరఫరాచేసిన 36వేల460 చేప పిల్లలను సర్పంచి విడుదలచేశారు. కార్యక్రమంలో మత్యశాఖ అసిస్టెంట్ బాలాజీ, ఫీల్డ్‌మ్యాన్ శేఖర్, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, ముదిరాజ్‌సంఘం అధ్యక్షులు రాములు, నాయకులు సురేష్‌గౌడ్, గొండ్ల సాయిలు, దశరథ్, సుధాకర్, యాదయ్య, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

### జీవులానాయక్ తండా పాఠశాలలో ఎండిఎంల నియామకం

**సిర్గాపూర్, జనవరి 8, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని జీవులానాయక్‌తండాలోని పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిర్వాహకులను నియమించేందుకు సర్పంచి పార్వతి సమక్షంలో గురువారం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి నిర్వాహకురాలిగా ఆర్ మరిబాయిని నియమించారు. పాఠశాలలో మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిని దానంచేసే దాతలు గంగారం, గోవర్దన్, మారుతిలతో చర్చించగా భూమి దానంచేసేందుకు సై అన్నారు. మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిని దానంచేసిన దాతలను గ్రామస్థులు, ఉపాధ్యాయులు స్నేహ, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## గిరిజన ఆశ్రమ వసతిగృహ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

**కౌడిపల్లి, జనవరి 8, ప్రభాతవార్త:**
జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రోత్సాహంతో మండల కేంద్రమైన కౌడిపల్లి గ్రామంలోగల బాలుర గిరిజన ఆశ్రమపాఠశాల విద్యార్థులకు, ఎస్టీ వసతిగృహ విద్యార్థులకు గురువారం హెచ్‌డబ్ల్యూఓ జయరాజ్ ఆధ్వర్యంలో దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈయనతోపాటు ఉపాధ్యాయులు నరేందర్, రాజేశ్వరీ, మంజుల, సత్యాగౌడు, పిఈటి పానిల్‌కుమార్, ఎఎన్‌ఎం వెన్నల, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాల అభివృద్ధికి కృషి : నర్మద

**కంటోన్మెంట్,జనవరి 8 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డు పరిధి లోని ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ మల్లికార్జున్ తెలిపారు. గురువారం 5వ వా ర్డు కాకగూడ,బ్రుక్‌బాండ్ కాలనీ 5 లక్షల వ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్మధ మాట్లాడుతూ ఈటెలరాజేందర్ సహకారంతో కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు ప్రకాశ్, ప్రభాకర్ రావ్, శశిధర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

### మానవతా దృక్పథంతో సేవలు అందించడం ఎంతో అభినందనీయం

**యూసుఫ్‌గూడ జనవరి 8, ప్రభాతవార్త :**
సమాజంలో ఉన్నదాంట్లో కొంత ఇతరులకు దానం చేసినప్పుడే జీవితంలో నిజమైన సంతృప్తి లభిస్తుందని అల్లాపూర్ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని పర్వత్ నగర్ మినీ ఫంక్షన్ హాల్లో గ్రేస్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో లెప్రసీ పేషెంట్లకు ఉచితంగా నిత్యవసర సరుకులతో పాటు దుస్తులు బియ్యం, దుప్పట్లు ఇతర అవసరమైన వస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పర్వత్‌నగర్ అధ్యక్షులు జాహేద్ షరీఫ్, రమేష్, డానియల్ రాజు, పాండు, కొండయ్య, రేవతి, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు శుభాకాంక్షలు తెలిపిన కార్యకర్తలు,అధికారులు

**కంటోన్మెంట్,జనవరి 8 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్‌ను గురువారం తుకారాంగేట్‌లోని ఆయన నివాసంలో పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంప్‌కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గత 10 రోజుల నుంచి ఎమ్మెల్యే అయ్యప్ప స్వామి మాల ధరించడం, అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడంతో అందుబాటులోలేక పోవడంతో గురువారం కార్యకర్తలు,అభిమానులు పెద్ద ఎత్తున తరలి రావడంతో క్యాంప్ కార్యాలయం సందడితో కోలాహలంగా మారింది.

## రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**-విద్యార్థినులతో ఎస్ఐ నరేష్**



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నరేష్

**జహీరాబాద్, జనవరి 8, ప్రభాతవార్త:**
రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్నప్పటి నుంచే రోడ్డు భద్రతపై అవగాహన పొంది ఉండాలని ఎస్ఐ నరేష్ సూచించారు. గురు వారం కోహీర్ మండల పరిధిలోని దిగ్వాల్‌లోని బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా, అతివేగంగా, రోడ్డు నిబంధనలు పాటించకుండా వాహనాలను తోలుతున్నందునే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని గుర్తుచేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, డెక్కన్ టోల్‌ప్లాజా సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సోషల్‌మీడియా మోసాలకు బలికావొద్దు

**-ఎస్ఐ రవిగౌడ్**

**కల్హేర్, జనవరి 8, ప్రభాతవార్త:**
అన్ని రకాల ఉపయోగం ఉన్న సోషల్ మీడియా వేదికతో మోసాలకు బలికావద్దని ఎస్ఐ రవిగౌడ్ మండల ప్రజలకు సూచించారు. డిజిటల్ ప్రపంచంలో ఉన్న మనకు సైబర్‌నేరగాళ్ల నుంచి మోసపోయే అవకాశాలు ఉన్నాయని, బ్లాక్‌మెయిల్ గ్యాంగ్‌లకు, హనీట్రాప్ మాఫియాలకు డిజిటల్‌మీడియా వేటస్థలంగా మార్చుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగులు, వ్యాపారులు, రాజకీయ, సామాజిక ప్రముఖులు, విద్యార్థులు, యువత, వయసుతో, వృత్తితో సంబంధం లేకుండా ఒక్క తప్పు క్లిక్‌చేస్తే, ఒక తప్పునమ్మకం జీవితాన్ని సమస్యల్లోకి నెట్టేస్తుందని గుర్తుచేశారు. హనీట్రాప్‌లో పడి డబ్బును పోగొట్టుకోవద్దన్నారు. గుర్తు తెలియని వారి నుంచి ఫోన్లో వచ్చే మెస్సేజ్‌లకు, ప్రొఫైల్‌లకు, ఫ్రెండ్ రిక్వెస్టులు అంగీకరించడం చేయకూడదన్నారు.

## ఎమ్మెల్యేని కలిసిన గొల్లగూడెం నూతన సర్పంచి



ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను కలిసిన సర్పంచి సుజాత

**సదాశివపేట, జనవరి 8, ప్రభాతవార్త:**
సదాశివపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో నూతనంగా గెలుపొందిన గొల్లగూడెం సర్పంచి మునిగే సుజాతనవీన్‌కుమార్ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గొల్లగూడెం సర్పంచికి ఎమ్మెల్యే శాలువావేసి సన్మానించడం జరిగింది. కార్యక్రమంలో ఉపసర్పంచి కొలుకూరి అశోక్‌కుమార్, గ్రామశాఖ అధ్యక్షులు నీరడి సర్వేశం, గ్రామ వార్డుమెంబర్లు, ఎరుకలసంఘం అధ్యక్షులు గోపాల్, మహిపాల్, రవి అశోక్, ప్రవీణ్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## కౌడిపల్లిలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న సర్పంచి, ఎంపిడిఓ



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న చంద్రం కృష్ణాగౌడ్, శ్రీనివాసులు

**కౌడిపల్లి, జనవరి 8, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన కౌడిపల్లి గ్రామంలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గురువారం పారిశుధ్య పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. ఈ పనులను జిల్లా సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, గ్రామసర్పంచి చంద్రం కృష్ణాగౌడ్ ఎంపిడిఓ శ్రీనివాసులతో కలిసి పర్యవేక్షించారు. కార్యక్రమంలో వీరితోపాటు కౌడిపల్లి ఉపసర్పంచి శ్వేతా మల్లికార్జున్‌గౌడ్, ఎంపిఓ రామారావు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, వార్డుసభ్యులు లక్ష్మిశరత్, నాయకులు బచ్చలి నాగరాజు, శరత్, కారోబార్ యేల్లం తదితరులు పాల్గొన్నారు.

## చైనా మాంజా విక్రయాలు నిషేధం

**-స్థానిక ఎస్ఐ రాజు**



పతంగుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎస్ఐ రాజు

**వెల్దుర్తి, జనవరి 8, ప్రభాతవార్త:**
రాష్ట్రప్రభుత్వం పతంగులకు ఉపయోగించి చైనా మాంజాను నిషేధించిందని ఎవరైనా దీన్ని విక్రయించినా, కొనుగోలు చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని స్థానిక ఎస్సై రాజు హెచ్చరించారు. ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని కిరాణాషాపుల్లో పతంగులు విక్రయించే షాపులను రాజు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ప్రజలు, వ్యాపారులు, నిబంధనలను పాటించాలని, చైనా మాంజాకు దూరంగా ఉండి సంక్రాంతిలో పండుగను సురక్షితంగా జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## సంక్రాంతి శోభను పెంచిన ఫిల్మ్ ఫెస్టివల్



సన్నివేశంలో ఒక భాగం

**పటాన్‌చెరు, జనవరి 8, ప్రభాతవార్త:**
గీతం 70 ఎంఎం ఇతివృత్తంతో, ది ఫిల్మ్ మేకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సినీపండుగను నిర్వహించి, సృజనాత్మక ప్రక్రియలపై విలువైన పరిచయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ చిత్ర దర్శకుడు, సినీపరిశ్రమ నిపుణులు ఒకేవేదికపై నిలిచి, విద్యార్థులకు ప్రేరణనిచ్చారు. ప్రధాన ఆకర్షణగా, ప్రఖ్యాత దర్శకుడు వెంకీ అట్లూరితో ప్రత్యేక ముఖాముఖి నిర్వహించారు. దీనికి అదనంగా, స్క్రిప్ట్ రైటింగ్ వర్క్‌షాపులో గోపి మోహన్ (రెడీ, దూకుడు, రేసుగుర్రం), ఎడిటింగ్ వర్క్‌షాపులో సాయిమురళి (అరణ్య, వ్యూహం, శివరపల్లి) ప్రధాన వక్తలు. కార్యక్రమాలను విద్యార్థి ప్రణయ్ మూల సమన్వయం చేశారు.